



# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 సంచిక: 56 ఎడిటర్: మేనం శ్యామ్ సోమవారం 14-09-2026 పేజీలు: 10


## సిరా చుక్క

వినాయక చవితి తో
నేర్చుకోవాల్సిన విశేష జ్ఞానమేంటి?
*భక్తిశ్రద్ధలు మరిచి
డ్యాన్సులతో దొర్లుతున్నారు
భక్తిశ్రద్ధలకన్నా కేరింతలకే ఎక్కువ
ప్రాధాన్యత ఇస్తున్నారు.
రికార్డింగ్ డ్యాన్సులతో రెచ్చిపోతున్నారు
ఇస్తారాజ్యంగా రోడ్లన్నీ దిగ్బందిస్తున్నారు
అల్లరితో కూడిన ఆటపాటలకా....
దేవుడు కర్తగా ఉన్నది...
నిజాన్ని నిర్భయంగా గమనించాలి
దేవుని భక్తిశ్రద్ధలతో పూజించాలి
వాస్తవ వాస్తవాలకు దూరంగా
వినాయక చవితి పండుగలు
భక్తులారా కోట్ల రూపాయల
సొమ్ము వృధా చేయకండి
వినాయక చవితి విశ్వాసం
సంతరించుకోవాలి.....

బరిగెల శివ
జర్నలిస్ట్ ....



# మా డ్యూటీలు ఇక్కడ.. మా కుటుంబాలు అక్కడ..!

- ఉమ్మడి రాష్ట్రంలో నియమితులైన హోంగార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీ చేయాలి
- ఏపీకి చెందిన వారిని ఏపీకి.. తెలంగాణ వారిని తెలంగాణకు పంపాలి
- రెండు రాష్ట్రాల సీఎంలు, డీజీపీలు చొరవ చూపాలని హోంగార్డుల వేడుకోలు
- 12 ఏళ్లు దాటినా పరిష్కారం కాని సమస్య
- కుటుంబాలకు దూరంగా విధులు
- రవాణా, ఆర్థిక సమస్యలతో సతమతం
- ఖాళీ పోస్టుల్లో అవకాశం కల్పించాలని మరో డిమాండ్





**జా వాయిస్ ప్రత్యేక కథనం** మా డ్యూటీలు ఇక్కడ.. మా కుటుంబాలు అక్కడ..! రాష్ట విభజన జరిగి 12 ఏళ్లు దాటుతున్నా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియమితులైన హోంగార్డుల స్థానికత, బదిలీల సమస్యకు మాత్రం ఇప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదు. ఉద్యోగం ఒక రాష్ట్రంలో.. కుటుంబం మరో రాష్ట్రంలో అన్న పరిస్థితిలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగి తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులను ఏపీకి, తెలంగాణ స్థానికత కలిగి ఆంధ్రప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులను తెలంగాణకు బదిలీ చేయాలని వారు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరుతున్నారు.2014 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం అనేక ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులను వారి స్థానికత ఆధారంగా రెండు రాష్ట్రాలకు కేటాయించినప్పటికీ.. హోంగార్డుల విషయంలో మాత్రం పూర్తిస్థాయిలో పరిష్కారం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హోంగార్డు ఉద్యోగాలకు ఎంపికై విధుల్లో చేరిన తమను రాష్ట్ర విభజన తర్వాత సొంత రాష్ట్రాలకు పంపకపోవడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే కొనసాగాల్సి వచ్చిందని చెబుతున్నారు.

### ఉద్యోగం ఇక్కడ.. కుటుంబం అక్కడ

హోంగార్డుల ప్రధాన సమస్య వారి కుటుంబ జీవితం. తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న ఏపీ స్థానికత కలిగిన హోంగార్డుల కుటుంబాలు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండటంతో నిత్యం కుటుంబాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు. అదే విధంగా ఏపీ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ స్థానికత కలిగిన హోంగార్డులు కూడా ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు.ఉద్యోగ బాధ్యతలు ఒక రాష్ట్రంలో, భార్యా పిల్లలు, తల్లిదండ్రులు మరో రాష్ట్రంలో ఉండటంతో కుటుంబాన్ని చూసుకోవడం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధులకు వెళ్లేందుకు తరచూ సుదూర ప్రయాణాలు చేయాల్సి రావడం వల్ల రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని, తక్కువ ఆదాయంతో కుటుంబ పోషణతో పాటు ప్రయాణ ఖర్చులను భరించడం భారంగా మారిందని చెబుతున్నారు.

### వృద్ధ తల్లిదండ్రులను చూసుకోలేని పరిస్థితి

హోంగార్డుల తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండటంతో వారిని దగ్గరుండి చూసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఉద్యోగం మరో రాష్ట్రంలో ఉండటం వల్ల ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నామని వారు అంటున్నారు. అనారోగ్యం, అత్యవసర పరిస్థితులు వచ్చిన సమయంలో వెంటనే కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడం కూడా కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏళ్ల తరబడి ఇలాంటి పరిస్థితిలో విధులు నిర్వహించడం వల్ల మానసిక ఒత్తిడి కూడా పెరుగుతోందని, కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ విధులు, రవాణా ఖర్చులు, ఆర్థిక ఇబ్బందులు అన్నీ కలిసి తమ జీవితాలను

మిగతా 2లో

# ఆ భూమి కొంటే.. చిక్కుల్లో పడ్డట్టే.!



- 22ఏ భూములపై కన్నేయండి
- స్థలం.. ఇల్లు కొనే ముందు అసలు విషయం తెలుసుకోండి
- నిషేధిత జాబితాలో ఉంటే కొనుగోలు చేసినా చిక్కులే
- ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూముల విషయంలో అప్రమత్తం
- పత్రాలు పరిశీలించకుండా అడ్వాన్స్ ఇస్తే నష్టపోయే ప్రమాదం

**ప్రజా వాయిస్,హైదరాబాద్:** సొంతింటి కోసం స్థలం కొనుగోలు చేస్తున్నారా కొత్తగా ఇల్లు తీసుకోవాలని చూస్తున్నారా అయితే ముందుగా 22ఏ భూముల అంశంపై అవగాహన తప్పనిసరి. భూమి రిజిస్ట్రేషన్ అవుతుందనే ఒక్క కారణంతో ఆ ఆస్తి పూర్తిగా సురక్షితమని భావించకూడదు. భూమి రికార్డులు, హక్కులు, పాత పత్రాలు, నిషేధిత జాబితా వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కొనుగోలు నిర్ణయం తీసుకోవాలి.

### 22ఏ అంటే..

ప్రభుత్వం కొన్ని ప్రత్యేక రకాల భూములను రిజిస్ట్రేషన్ చేయకుండా నిషేధిత జాబితాలో ఉంచుతుంది. వీటినే సాధారణంగా 22ఏ భూములుగా పిలుస్తారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, దేవాదాయ లేదా వక్ఫ్ సంస్థలకు చెందిన భూములు, అటవీ భూములు, కొన్ని వివాదాస్పద ఆస్తులు తదితరాలు ఈ జాబితాలో ఉండే అవకాశం ఉంది. అయితే ప్రతి ఆస్తి విషయంలో అధికారిక రికార్డుల ఆధారంగా పరిస్థితిని విడిగా నిర్ధారించుకోవాలి.

### రిజిస్ట్రేషన్ అయినా.. సమస్య ఉండొచ్చు


భూమి రిజిస్ట్రేషన్ పూర్తయిందని యాజమాన్య హక్కులు పూర్తిగా భద్రమని భావించకూడదు. పాత విక్రయ పత్రాలు, వారసత్వ హక్కులు, భూమి స్వభావం, కోర్టు కేసులు, ప్రభుత్వ నిషేధాలు, ఇతర భారాలు వంటి అంశాలు కూడా

మిగతా 2లో

# రూల్ టేకర్ కాదు.. రూల్ షేపర్ గా ఎదగాలి.!

- ప్రపంచ నిర్ణయాల్లో గ్లోబల్ సౌత్‌కు తగిన భాగస్వామ్యం ఉండాలి
- 'పిరమిడ్ ఆఫ్ ప్రివిలేజ్'ను భాగస్వామ్య వేదికగా మార్చాలి
- యూఎన్ భద్రతా మండలిలో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి
- సీఫేరర్ల రక్షణకు ఎమర్జెన్సీ సపోర్ట్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

2లో




# తెలంగాణలో జనసేన 'స్పీడ్'.!

- పవన్ పర్యటనకు రంగం సిద్ధం
- పొత్తులపై మళ్లీ హాట్ హాట్ చర్చ
- తెలంగాణపై ఫోకస్ పెంచిన జనసేన అధినాయకత్వం
- 10 పార్లమెంట్ నియోజక వర్గాల్లో సంస్థాగత సమీక్షలు పూర్తి
- జీహెచ్ ఎంసీ, కార్పొరేషన్ , అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి కసరత్తు
- 22ఏ భూములు, ఫీజు రీయింబర్స్ మెంట్ అంశాలపై ఆందోళనలు
- పవన్ పర్యటనతో రాజకీయ సమీకరణాలపై క్లారిటీ వస్తుందా?
- ఏపీలో మిత్రపక్షాలైన టీడీపీ, బీజేపీతోనే తెలంగాణలోనూ జట్టు కడతారా.?



**ప్రజా వాయిస్,హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో జనసేన దూకుడు పెంచుతోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు పెద్దగా హడావుడి లేకుండా కార్యకలాపాలు సాగించిన జనసేన.. తాజాగా వ్యూహాన్ని మార్చి ప్రజాక్షేత్రంలోకి చురుగ్గా వెళ్తుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరలో తెలంగాణలో పర్యటించనున్నారన్న పార్టీ నేతల ప్రకటనలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

### సంస్థాగత బలోపేతంపై దృష్టి

పవన్ కల్యాణ్ ఆదేశాలతో తెలంగాణ జనసేన నాయకత్వం నియోజకవర్గాల

మిగతా 2లో

# 2029 నాటికి 21 రాష్ట్రాల్లో ఒకే చట్టం.!

- యూసీసీ అమలుకు ఎన్డీయే సర్కారు అడుగులు
- వివాహం నుంచి వారసత్వం వరకు.. అందరికీ ఒకే విధానం
- ఉగ్రవాదంపై రాజీలేని పోరు.. 'జీరో టాలరెన్స్' విధానమే మా నినాదం
- సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్‌స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ మా నిర్ణయాత్మక చర్యలు: అమిత్ షా
- మోదీ జన్మదినం నుంచి నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్'.. దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు



2లో

# ఆర్యవైశ్యులకు సర్కారు అండ.!





- పేద కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం భరోసా
- ఉప్పల్ భగాయత్‌లో ఆత్మగౌరవ భవనానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన
- పేద ఆర్యవైశ్య పిల్లలకు భవనం పూర్తిస్థాయిలో ఉపయోగపడాలి
- ఐక్యంగా ఉంటే రాజకీయాల్లోనూ తమ వాటా సాధించుకోవచ్చు:
- సీఎం రేవంత్ రెడ్డి

**ప్రజా వాయిస్,హైదరాబాద్:** పేద ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆర్యవైశ్యులు సౌమ్యులు, మానవతావాదులుగా సమాజంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని, పేదల విశ్వాసానికి బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తున్నారని కొనియాడారు. హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో నిర్మించనున్న ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయానికి సీఎం శంకుస్థాపన చేశారు.

### పేద పిల్లల కోసమే ఉపయోగపడాలి

ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని సీఎం స్పష్టం చేశారు. భవనం పూర్తయిన తర్వాత పేద ఆర్యవైశ్య కుటుంబాల పిల్లలకు విద్య, ఉపాధి, ఇతర అవసరాలకు ఉపయోగపడేలా ప్రణాళిక రూపొందించాలని సంఘం ప్రతినిధులకు సూచించారు. ఆత్మగౌరవ భవనం కేవలం నిర్మాణంగా కాకుండా పేద కుటుంబాలకు అండగా నిలిచే వేదికగా మారాలని ఆకాంక్షించారు.

### గాంధీ నుంచి రోశయ్య వరకు..

సాధారణ ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన మహాత్మాగాంధీ ప్రపంచస్థాయి నాయకుడిగా ఎదగడం దేశానికే గర్వకారణమని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో గాంధీ విగ్రహాలు కనిపిస్తాయని గుర్తుచేశారు. ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగాన్ని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో

మిగతా 2లో

# బ్రిక్స్ విందులో 'వెజ్' వార్.!

- నాన్‌వెజ్ లేకపోవడంపై రాహుల్ సెటైర్లు
- భారత్‌లో 80 శాతం మంది నాన్‌వెజ్ తింటారంటూ వ్యాఖ్యలు
- ఆహారంపైనా రాజకీయమా? అంటూ రిజిజు ఘాటు కౌంటర్
- విదేశీ అతిథులకు భారతీయ శాకాహార రుచుల విందు

2లో



# మా డ్యూటీలు ఇక్కడ.. మా కుటుంబాలు అక్కడ..!

**మొదటి పేజీ తరువాయి**

ఇబ్బందుల్లోకి నెట్టాయని హోంగార్డులు చెబుతున్నారు.

## పిల్లల చదువుపైనా ప్రభావం

ఈ సమస్య ప్రభావం హోంగార్డుల పిల్లలపై కూడా పడుతోందని వారు పేర్కొంటున్నారు. కుటుంబాలు ఒక రాష్ట్రంలో ఉండటం, ఉద్యోగం మరో రాష్ట్రంలో ఉండటంతో పిల్లల విద్య, నివాసం, భవిష్యత్ స్థానికతకు సంబంధించిన అంశాల్లో అనిశ్చితి నెల కొందని చెబుతున్నారు.ప్రస్తుతం తెలంగాణలో చదువుతున్న ఏపీ స్థానికత కలిగిన హోంగార్డుల పిల్లలు భవిష్యత్తులో స్థానిక తకు సంబంధించిన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఏపీలో నివసిస్తూ చదువుకుంటున్న తెలంగాణ స్థానికత కలిగిన హోంగార్డుల పిల్లలకు కూడా ఇలాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

## దాదాపు 200 మంది చొప్పున ఉన్నారని హోంగార్డుల వాదన

హోంగార్డుల వర్గాల వివరాల ప్రకారం తెలంగాణలో సుమారు 200 మంది వరకు ఏపీ స్థానికత కలిగిన హోంగార్డులు పనిచే స్తున్నారని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సుమారు 200 మంది వరకు తెలంగాణ స్థానికత కలిగిన హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. అయితే ఈ సంఖ్య అధికారి కంగా ప్రభుత్వ స్థాయిలో నిర్ధారించాల్సి ఉంది.ఇరు రాష్ట్రాల్లో పనిచేస్తున్న తమను పరస్పర సమన్వయంతో సొంత రాష్ట్రాలకు బదిలీ చేస్తే తమ కుటుంబ సమస్యలు చాలా వరకు పరిష్కారమ వుతాయని హోంగార్డులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## 12 ఏళ్లు దాటినా పరిష్కారం ఏది?

రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు దాటుతున్నా ఈ సమస్యకు పరిష్కారం లభించకపోవడం పట్ల హోంగార్డులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వాలు, హోంశాఖ, పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామని చెబుతున్నారు.రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులు, హోంమంత్రులు, డీజీపీలు పరస్పరం చర్చించి ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఒక రాష్ట్రానికి చెందిన హోంగార్డులను మరో రాష్ట్రంలో కొనసాగిం చడం వల్ల ఏర్పడుతున్న కుటుంబ, ఆర్థిక, పరిపాలనా సమస్య లకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

## ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన హోంగార్డులను సొంత రాష్ట్రానికి పంపేలా చర్యలు తీసుకోవా లని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లిన ఆయన.. హోంగార్డుల సమస్యను పరిష్క రించాలని విజ్ఞప్తి చేశారు.ఈ అంశంపై గతంలో సీపీఐ నేత రామకృష్ణతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన విషయాన్ని కూడా కూనంనేని సాంబశివరావు గుర్తు చేసినట్లు హోంగార్డుల వర్గాలు పేర్కొంటున్నాయి. ఏపీ స్థానికత కలిగిన హోంగార్డులను ఏపీకి, తెలంగాణ స్థానికత కలిగిన హోంగార్డులను తెలంగాణకు పంపేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

## ఖాళీ పోస్టుల్లో అవకాశం కల్పించాలని మరో డిమాండ్

హోంగార్డుల సమస్యకు బదిలీలతో పాటు మరో ప్రత్యామ్నా యాన్ని కూడా వారు ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు. తెలం గాణలో హోంగార్డులుగా పనిచేసిన వారిలో పలువురు ఇప్పటికే కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికై నియమితులయ్యారని, అదే సమయంలో హోంగార్డు పోస్టుల్లో కూడా ఖాళీలు ఉన్నాయని వారు చెబుతున్నారు.ఖాళీగా ఉన్న హోంగార్డు పోస్టుల్లో తమకు సొంత రాష్ట్రంలో అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే అనుభవం ఉన్న తమకు స్థానికంగా విధులు నిర్వహించే అవకాశం కల్పిస్తే కుటుంబ సమస్యలు తగ్గడంతో పాటు పోలీసు శాఖకు కూడా అనుభవజ్ఞులైన సిబ్బంది అందుబాటులో ఉంటారని వారు అభిప్రాయపడుతున్నారు.

## అదనపు విధులపైనా ఆవేదన

హోంగార్డులు తమకు కేటాయించిన అధికారిక విధులతో పాటు కొన్ని సందర్భాల్లో మంత్రులు, పోలీసు ఉన్నతాధికారుల నివాసాల్లో అనధికారిక సేవలకు వినియోగించబడుతున్నారనే ఆరోపణలు కూడా చేస్తున్నారు. దీనిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.హోంగార్డుల సేవలను వారి అధి కారిక విధులకే పరిమితం చేసి, వారికి గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని వారు చెబుతు న్నారు.

## ప్రభుత్వాల సమన్వయంతోనే పరిష్కారం

ఇది ఒక్క రాష్ట్ర ప్రభుత్వంతో పరిష్కరించగల సమస్య కాదని హోంగార్డులు అంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు పరస్పరం చర్చించి, రెండు రాష్ట్రాల పోలీసు శాఖలు, హోంశాఖలు, డీజీపీలు సమన్వయంతో విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కోరుతున్నారు.ఏపీ స్థానికత కలిగిన హోంగార్డులను ఏపీకి, తెలంగాణ స్థానికత కలిగిన హోంగార్డులను తెలంగాణకు పంపేలా పరస్పర బదిలీ విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇరు రాష్ట్రాల్లో ఖాళీలు, పోస్టుల లభ్యత, నియామక నిబంధనలు, స్థానికత తదితర అంశాలను పరిశీలించి మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

## పిల్లల విద్యపై ఆందోళన

పిల్లల విద్యా సంవత్సరం కొనసాగుతున్న నేపథ్యంలో సమస్యను మరింత ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని హోంగార్డులు కోరుతున్నారు. పిల్లల చదువులు ఒక రాష్ట్రంలో కొనసాగుతున్న సమయంలో కుటుంబాలు, ఉద్యోగ స్థానాలు వేర్వేరు రాష్ట్రాల్లో ఉండటం వల్ల భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలను పలుమార్లు కలిసి తమ సమస్యను వివరించినా నిర్ణయం వెలువడకపోవడంతో నిరాశకు గురవుతున్నామని వారు అంటున్నారు.

## ప్రజా సంఘాలు, మేధావులు స్పందిం చాలి

ఏళ్ల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వహి స్తున్న హోంగార్డుల సమస్యను మానవతా కోణంలో చూడాలని ప్రజా సంఘాలు, మేధావులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. తక్కువ ఆదాయ వర్గానికి చెందిన ఉద్యోగులు కావడంతో సుదూర ప్రయాణాలు, రెండు చోట్ల కుటుంబ నిర్వహణ, పిల్లల విద్య, వృద్ధ తల్లిదండ్రుల బాధ్యత వంటి అంశాలు వారిపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని అభి ప్రాయపడుతున్నారు.రాష్ట్ర విభజనకు సంబంధించిన అనేక అంశాలు పరిష్కారమైనప్పటికీ హోంగార్డుల విషయంలో ఇంతకాలం సమస్య కొనసాగడం విచారకరమని వారు అంటున్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర అంగీకారంతో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకుంటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.



## సీఎంలు, డీజీపీలకు హోంగార్డుల విజ్ఞప్తి

"మా డ్యూటీలు ఇక్కడ.. మా కుటుంబాలు అక్కడ.." అనే పరిస్థితి నుంచి తమను బయటపడేయాలని హోంగార్డులు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను వేడుకుంటున్నారు. తెలంగా ణలో పనిచేస్తున్న ఏపీ స్థానికత కలిగిన హోంగార్డులను ఏపీకి, ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత కలిగిన హోంగార్డులను తెలంగాణకు పంపేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతు న్నారు.రెండు రాష్ట్రాల డీజీపీలు, హోంశాఖలు, సంబంధిత ఉన్న తాధికారులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించి పరస్పర బదిలీలకు మార్గం సుగమం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇప్పటికైనా పరిష్కారం చూపుతారా?

2014లో రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి 12 ఏళ్లు దాటినా కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల సమస్యకు ఇప్పటికైనా ముగింపు పలుకుతారా? అనే ప్రశ్నలు హోంగార్డుల వర్గాల్లో వినిపిస్తున్నాయి.ఉద్యోగ భద్రతతో పాటు కుటుంబ జీవితం కూడా ముఖ్యమేనని, సుదీర్ఘకాలంగా సేవలం దిస్తున్న తమ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా మానవ తా దృక్పథంతో చూడాలని హోంగార్డులు కోరుతున్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్చించి పరస్పర బదిలీలకు నిర్ణయం తీసుకోవడంతో పాటు ఖాళీ పోస్టులు, నియామక అవకాశాలను పరిశీలించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్ప టికైనా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ అంశంపై దృష్టి సారించి.. హోంగార్డుల కుటుంబాలను ఏకం చేసే నిర్ణయం తీసుకోవాలని బాధిత హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# రూల్ టేకర్ కాదు.. రూల్ షేపర్ గా ఎదగాలి.!

**ప్రజా వాయిస్,న్యూఢిల్లీ:** ప్రపంచ వ్యవహారాల్లో గ్లోబల్ సౌత్ దేశాలు కేవలం నిబంధనలు పాటించే స్థాయిలో ఉండకుండా.. వాటిని రూపొందించే శక్తిగా ఎదగాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బ్రిక్స్ సదస్సు రెండో రోజు 'సమ్మిళిత ప్రపంచ పాలన,బహుపాక్షికత పటిష్టత' అంశంపై జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన.. అంతర్జాతీయ సంస్థల్లో సంస్క రణలు, గ్లోబల్ సౌత్ దేశాలకు నిర్ణయాధికారంలో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని ప్రస్తా వించారు.

### నిర్ణయాల్లో భాగస్వామ్యం అవసరం

ప్రపంచ సంక్షోభాల ప్రభావం గ్లోబల్ సౌత్ దేశాల పైనే ఎక్కువగా ఉంటోందని మోదీ పేర్కొన్నారు. అయితే వాటికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో ఆయా దేశాలకు తగిన స్థానం లేదన్నారు. నేటి ప్రపంచ వాస్తవాలకు అను గుణంగా గ్లోబల్ గవర్నెన్స్‌లో మార్పులు రావాలని సూచించారు. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వంటి కీలక సంస్థల్లో గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

### పిరమిడ్ నుంచి భాగస్వామ్యానికి

ప్రపంచ వ్యవస్థలో ఉన్న 'పిరమిడ్ ఆఫ్ ప్రివిలేజ్'ను 'ప్లాట్‌ఫార్మ్ ఆఫ్ పార్ట్‌నర్‌షిప్'గా మార్చాలని ప్రధాని మోదీ అన్నారు. బ్రిక్స్ ద్వారా గ్లోబల్ సౌత్‌కు చెందిన యువ దౌత్యవేత్తలు, విధానకర్త లకు చర్చల నైపుణ్యాలు, శిక్షణ అందించవచ్చని పేర్కొన్నారు.

### నావికుల కోసం ప్రత్యేక నెట్‌వర్క్

ప్రపంచ వాణిజ్యానికి కీలకంగా సేవలందిస్తున్న నావికులు సంక్షోభ సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. వారి రక్షణ కోసం 'సీఫేరర్స్ ఎమర్జెన్సీ సపోర్ట్ నెట్‌వర్క్' ఏర్పాటు చేయాలని ప్రతిపాదిం చారు.

### భవిష్యత్తును తీర్చిదిద్దే హక్కు అందరిదే

మన భవిష్యత్తు ఉమ్మడిదే.. ఆ భవిష్యత్తును తీర్చిదిద్దే హక్కు కూడా అందరిదే అని మోదీ స్పష్టం చేశారు. సమావేశం ముగింపులో సభ్య దేశాల అంగీకారంతో 'న్యూఢిల్లీ బ్రిక్స్ లీడర్స్ డిక్ల రేషన్' ఆమోదించారు.

# ఆ భూమి కొంటే.. చిక్కుల్లో పడ్డట్టే.!

**మొదటి పేజీ తరువాయి**

కీలకమే. అందుకే కొనుగోలుకు ముందు ఆస్తి టైటిల్‌పై స్పష్టత తీసుకోవాలి.

### కొనేముందు ఇవి చెక్ చేయండి

సర్వే నంబర్.. భూమి విస్తీర్ణం, యజమాని పేరు సరైందో లేదో పరిశీలించాలి.22ఏ జాబితా.. ఆ భూమి నిషేధిత జాబితాలో ఉందా లేదా నిర్ధారిం చుకోవాలి.పాత పత్రాలు.. గతంలో భూమి ఎవరి చేతుల్లో ఉందో పరిశీలించాలి.భారాలు.. బ్యాంకు రుణాలు, ఇతర క్లెయిమ్‌లు లేదా కోర్టు వివాదాలు ఉన్నాయా తెలుసుకోవాలి.అనుమతులు.. స్థలం అయితే లేఅవుట్, ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ అయితే సంబంధిత నిర్మాణ అనుమతులు తనిఖీ చేయాలి.

### అడ్వాన్స్ విషయంలో జాగ్రత్త

అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయో తెలుసుకోక ముందే అడ్వాన్స్ చెల్లించకపోవడం మంచిది. అనుమానం ఉన్న ఆస్తుల విషయంలో అధికారిక రికార్డులతోపాటు న్యాయ నిపుణుల సలహా తీసు కోవాలి.ఒక్కసారి కొనుగోలు చేస్తే జీవితకాల పెట్టుబడి.. అందుకే 22ఏ జాబితా నుంచి టైటిల్ వరకు అన్నీ చెక్ చేసుకున్నాకే స్థలం లేదా ఇల్లు కొనండి.

# బ్రిక్స్ విందులో 'వెజ్' వార్.!

**ప్రజా వాయిస్,న్యూఢిల్లీ:** అంతర్జాతీయ వేదికగా భారత్ ప్రతిష్ఠను చాటిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగిసిన వేళ.. గాలా డిన్నర్ మెనూ దేశీయ రాజ కీయాలకు వేదికగా మారింది. విదేశీ అతిథులకు పూర్తిగా శాఖాహార విందు ఏర్పాటు చేయడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి తెరతీశాయి. భారత్‌లో అత్యధికులు నాన్‌వెజ్ తింటారని గుర్తుచేస్తూ రాహుల్ సెటైర్లు వేయగా.. విదేశీ అతిథులకు భారతీయ సంప్రదాయ వంటకాలు రుచిచూపించడంపైనా రాజకీయాలు చేయడమేమిటని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు.

### 80 శాతం నాన్‌వెజ్ తినేవారే.!

బ్రిక్స్ సదస్సులో విదేశీ నేతలకు వడ్డించిన ప్యూర్ వెజ్ డిన్నర్‌పై రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. భారత్‌లో దాదాపు 80 శాతం మంది నాన్‌వెజిటేరియన్లేనని పేర్కొన్నారు. భారతీయ నాన్‌వెజ్ వంటకాలు ఎంతో రుచికర మైనవని చెబుతూ.. తన సోదరి ప్రియాంక గాంధీ చేసిన చోలే భటూరేను కూడా ప్రస్తావించారు. దీంతో బ్రిక్స్ విందు మెనూ ఒక్కసారిగా రాజకీయ చర్చకు కేంద్రబిందువైంది.

### రిజిజు 'రివర్స్ కౌంటర్'

రాహుల్ వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఘాటుగా బదులిచ్చారు. అంతర్జాతీయ సదస్సుకు వచ్చిన విదేశీ అతిథులకు అందించిన ఆహారం పైనా కాంగ్రెస్ రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. భారతీయ ప్రాంతీయ సంప్రదాయాలు, పోషక విలువలు, విభిన్న రుచులతో కూడిన శాఖాహార వంటకాలను అతిథులు ఎంతో ఆస్వాదించారని తెలిపారు.

### విందులో భారతీయ 'రుచుల దౌత్యం'

బ్రిక్స్ గాలా డిన్నర్ కోసం మెనూను ప్రత్యేకంగా రూపొందించారు. భారతీయ సంస్కృతి, వివిధ ప్రాంతాల వంటకాల వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా ఖాండ్వీ మిల్లే, ఖుంబ్ గలౌటీ, గుచ్చి మార్మిక్, పనీర్ లబాబ్‌దార్, క్యారట్ బీన్ పోరియల్ వంటి వంటకాలను వడ్డించారు. మిల్లెట్ పులావ్, బీట్‌రూట్ రైతా, వివిధ రకాల భారతీయ రొట్టెలతో పాటు ఓల్డ్ ఢిల్లీ ఫ్రూట్ క్రీమ్ విత్ జిలేబీ, షాహ్తూత్ ఫిర్నీ వంటి డెజర్ట్‌లను అందించారు.

### విందు.. వినోదం.. భారతీయ వైభవం

ఆహారంతో పాటు భారతీయ సాంస్కృతిక వైభవాన్ని చాటేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిం చారు. భారత్‌తో పాటు బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన 100 మందికి పైగా కళాకారులు ప్రదర్శ నలు ఇచ్చారు. అంతర్జాతీయ వేదికపై భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించేలా విందును రూపొందించినట్లు ప్రభుత్వం చెబుతుండగా.. అదే మెనూపై కాంగ్రెస్ విమర్శలు చేయడం రాజకీయ దుమారానికి కారణమైంది.

# తెలంగాణలో జనసేన 'స్పీడ్'.!

**మొదటి పేజీ తరువాయి**

వారీగా పార్టీ పరిస్థితిపై సమీక్షలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని పది పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో సమీక్షా సమావేశాలను పూర్తి చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, కొత్త నాయకత్వాన్ని తయారు చేయడం, చేరికలను ప్రోత్సహిం చడం వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది. త్వరలో పవన్ తెలంగాణలో పర్యటిస్తారన్న సంకేతా లతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది.

### ఎన్నికల బరిలోకి..!

తెలంగాణలో జరగనున్న ప్రతి ఎన్నికలో పోటీ చేయాలన్న లక్ష్యంతో జనసేన ముందుకు సాగు తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం చెబుతోంది. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు ముందుగానే అభ్యర్థిని ప్రకటించడం ద్వారా పార్టీ తన ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. అనంతరం జీహెచ్ఎంసీ, ఇతర కార్పొరేషన్ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీకి సిద్ధమవుతోంది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న బలాబలాలను అంచనా వేస్తోంది.

### ప్రజా సమస్యలపై పోరాటం

కేవలం పవన్ కల్యాణ్ అభిమానుల బలంపైనే ఆధారపడకుండా రాజకీయ పార్టీగా తన కార్యక లాపాలను విస్తరించేందుకు జనసేన ప్రయత్నిస్తోంది. 22ఏ భూముల సమస్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ప్రజలకు సంబంధించిన అంశాలను చేపట్టి ఆందోళనలు నిర్వహి స్తోంది. ఇటీవల అసెంబ్లీ ముట్టడికి చేసిన ప్రయత్నం కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీ సింది. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాల ద్వారా పార్టీకి క్షేత్రస్థాయిలో గుర్తింపు పెంచుకో వాలని నాయకత్వం భావిస్తోంది.

### పొత్తు ఎవరితో.?

జనసేన తెలంగాణలో ఎంత మేరకు సొంతంగా బలం పెంచుకుంటుందన్నదానికంటే.. ఎన్నికల్లో ఎవరితో పొత్తు పెట్టుకుంటుందన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ఆంధ్రప్ర దేశ్‌లో టీడీపీ, బీజేపీతో కలిసి కూటమిలో ఉన్న జనసేన.. తెలంగాణలోనూ ఇదే ఫార్ములాను కొనసాగిస్తుందా లేక ఒంటరిగా బరిలోకి దిగుతుందా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. జనసేన పొత్తుల అంశాన్ని ప్రస్తావించిన సందర్భాల్లో తెలంగాణ బీజేపీ నేతలు భిన్నంగా స్పందించిన విషయం తెలిసిందే.

### పవన్ పర్యటనతో క్లారిటీ వస్తుందా.?

జనసేన ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి ఇటీవల ఓ చానల్‌తో మాట్లాడుతూ.. తమిళనాడులో నటుడు విజయ్‌కు లభిస్తున్న రాజకీయ ఆదరణ తరహాలో తెలంగాణలోనూ పవన్ కల్యాణ్ బలమైన ప్రజాశక్తిగా ఎదిగారని వ్యాఖ్యానించారు. త్వరలో పవన్ తెలంగాణలో పర్యటించను న్నారని కూడా సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో పవన్ పర్యటన ఎప్పుడు ఉంటుంది పార్టీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటి పొత్తులపై ఏదైనా స్పష్టత ఇస్తారా అన్న అంశాలు ఆసక్తికరంగా మారాయి. పవన్ పర్యటనతో తెలంగాణ జనసేన రాజకీయ వ్యూహంపై మరింత స్పష్టత వచ్చే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

# 2029 నాటికి 21 రాష్ట్రాల్లో ఒకే చట్టం.!

**ప్రజా వాయిస్,డెస్క్ బ్యూరో:** దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలును మరింత విస్త రించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఎన్డీయే పాలనలో ఉన్న 21 రాష్ట్రాల్లో యూసీసీని అమల్లోకి తీసుకొస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. కులం, మతం ఆధారంగా వ్యక్తిగత చట్టాల్లో ఉండే వ్యత్యాసాలను తొలగించి.. వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి అంశాలకు ఒకే చట్టాన్ని వర్తింపజేయడమే యూసీసీ లక్ష్యమని ఆయన వివరించారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని, మిగతా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లోనూ దీనిని పూర్తిస్థాయిలో తీసుకొస్తామని చెప్పారు.

### తీవ్రవాదానికి తావులేదు

దేశ భద్రతకు విఘాతం కలిగించే తీవ్రవాదంపై కేంద్రం కఠిన వైఖరితో ఉందని అమిత్ షా స్పష్టం చేశారు. 'జీరో టాలరెన్స్' విధానంతో ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నామని తెలిపారు. దేశాన్ని రక్షించేందుకు అవసరమైన ఎలాంటి నిర్ణయానికైనా ప్రభుత్వం వెనుకాడదన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్‌స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలు కేంద్రం తీసుకున్న నిర్ణయాత్మక చర్యలకు ఉదాహరణలని పేర్కొన్నారు.

### మూడు కీలక విజయాలు

ఆర్టికల్ 370 రద్దు, నక్సలిజం నియంత్రణ, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి స్థాపన తమ ప్రభుత్వ ప్రధాన విజయాల్లో భాగమని అమిత్ షా పేర్కొన్నారు. దేశ సమగ్రత, అంతర్గత భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు.

### నెలరోజులు సేవా కార్యక్రమాలు

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాధినేతగా బాధ్యతలు చేపట్టి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు అమిత్ షా తెలిపారు. దేశవ్యాప్తంగా 13 రకాల కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. నమో సేవా గాథ,అంగన్వాడీ ఉత్సవ్,సేవా సేతు,జన్ సేవక్ మహాకుంభ్,వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ,సేవా జ్యోతి యాత్ర తో పాటు చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్, ఆవిష్కరణ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



# ఐదేళ్ల చిన్నారిపై మేనమామ అఘాయిత్యం!

- కాగజ్ నగర్ లో దారుణ ఘటన..
- నిందితుడిని పట్టుకుని చితక బాదిన స్థానికులు
- నిందితుడి ఇంటి వద్దకు భారీగా తరలివచ్చిన మహిళలు.. పోలీసుల పహారా
- స్టేషన్ కు తరలిస్తుండగా అడ్డుకున్న మహిళలు.. దాడికి యత్నం
- కఠినంగా శిక్షించాలని డిమాండ్.. ఘటనతో కాగజ్ నగర్ లో తీవ్ర ఉద్రిక్తత

**ప్రజా వాయిస్,కాగజ్‌నగర్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఐదేళ్ల చిన్నారిపై మేనమామ అఘాయిత్యానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. విషయం తెలుసుకున్న స్థానికులు నిందితుడిని పట్టుకుని చితకబా దారు. అనంతరం నిందితుడి ఇంటి వద్దకు మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. నిందితు డిని పోలీసు పహారా మధ్య స్టేషన్‌కు తరలి స్తుండగా కొందరు మహిళలు అడ్డుకుని అతడిపై దాడికి ప్రయత్నించారు. పోలీసులు వారిని నిలువరించి నిందితుడిని స్టేషన్‌కు తర లించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారికి న్యాయం చేయడంతో పాటు నింది తుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

# ఆర్యవైశ్యులకు సర్కారు అండ.!

**మొదటి పేజీ తరువాయి**

ఆర్థిక మంత్రిగా కొణిజేటి రోశయ్య అందించిన విశిష్ట సేవలను ప్రస్తావించారు.

### విశ్వాసానికి బ్రాండ్ అంబాసిడర్లు

గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు సరుకులు అరువుగా ఇచ్చే విషయంలోనూ ఆర్యవైశ్యులు మానవతతో వ్యవహరిస్తారని సీఎం పేర్కొన్నారు. ముందు చూపుతో వ్యవహరించడం, జాగ్రత్తగా ఉండటం ఆర్యవైశ్యుల డీఎన్ఏలోనే ఉందన్నారు. వ్యాపారంతో పాటు సామాజిక బాధ్యతలోనూ వారు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు.

### ఐక్యతే రాజకీయ బలం

ఆర్యవైశ్యులంతా కలిసికట్టుగా ఒక్కతాటిపై నడిస్తేనే మరింత బలం చేకూరుతుందని సీఎం సూచించారు. ఐక్యంగా ఉంటే రాజకీయాల్లో తమ వాటాను తామే సాధించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం కల్పించామని గుర్తుచే శారు.ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



వినాయక చవితి శుభాకాంక్షల తో రూ.2500
ఇట్లు సిహెచ్ యాదగిరి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధ హాస్పిటల్ పుల్కల్



## చట్టం ముందు ఎంతటివారైనా ఒక్కటే

- దళిత భూమి వివాదంలో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు
- ముగ్గురు రెవెన్యూ అధికారులు, సీఐ సహా కేసు నమోదు
- తప్పుడు డీమార్కేషన్, పంచనామాతో భూమి కబ్జాకు యత్నించారంటూ ఆరోపణలు

**ప్రజా వాయిస్,బీబీనగర్:** చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నది ఈ కేసు మరోసారి చాటింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలోని సర్వే నంబర్ 339లో దళితులకు కేటాయించిన భూమి వివాదం చివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుకు దారితీసింది. ఈ వ్యవహారంలో ముగ్గురు రెవెన్యూ అధికారులు, ఓ సీఐ సహా మొత్తం 14 మందిపై కేసు నమోదైంది.బాధితుల కథనం ప్రకారం.. ఇందిరాగాంధీ హయాంలో దళితులకు కేటాయించిన భూమిలో ఎకరం భూమికి సంబంధించి 2018–19లో కొందరు రెవెన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై వ్యవహరించారని ఆరోపించారు. రెవెన్యూ నిబంధనలను పాటించకుండా తప్పుడు డీమార్కేషన్, పంచనామా రూపొందించి తమకు అనుకూలంగా వ్యవహరించారని పేర్కొన్నారు. భూమి సర్వే సమయంలో తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, బలవంతంగా ఎంఓయూలు రాయించుకుని భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.ఈ వ్యవహారంపై బాధితులు భూమికి సంబంధించిన పత్రాలను సేకరించి పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేక పోయిందని తెలిపారు. బీబీనగర్ పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పైగా భూమిపై ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ తనపై తప్పుడు కేసు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఓ అడ్వకేట్ ఆరోపించారు.దీంతో బాధితులు నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టును ఆశ్రయించారు. సమర్పించిన పత్రాలను పరిశీలించిన కోర్టు.. ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టి ఇన్వెస్టిగేషన్ రిపోర్టు సమర్పించాలని ఆదేశించినట్లు బాధితులు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురు రెవెన్యూ అధికారులు, సీఐ సహా మొత్తం 14 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైనట్లు పేర్కొన్నారు.కోర్టు ఆదేశాలతో కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిగితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పండుగొచ్చింది.. కరెంటు పోయింది!

- పండుగ వేళ చీకటి మోత
- ఆసిఫాబాద్ లో 6 గంటల అఘోషిత కరెంటు కోతలు
- జిల్లాలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం
- వినాయక మండపాలకు కరెంటు కాటా - లక్షలు ఖర్చు.. లైటింగ్ లేదు
- 24 గంటల కరెంటు ఎక్కడ? ప్రజల నిలదీత
- చీకట్లోనే పండుగలు
- ఈ విధంగానే నిర్వహిస్తే పెద్ద ఎత్తున రైతులతో కలిసి ధర్నా చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

**ప్రజా వాయిస్, కౌటాల:** పండుగ వచ్చిందంటే ఊరంతా వెలుగులతో కళకళలాడాలి. కానీ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. వినాయక చవితి, దసరా పండుగలు సమీపిస్తున్న వేళ కరెంటు కోతలతో ప్రజలు అంధకారంలో గడుపుతున్నారు.

### గ్రామాల్లో 6 గంటలు అఘోషిత కోతలు

జిల్లాలోని కౌటాలతో పాటు పలు మండలాల్లో గత వారం రోజులుగా రోజుకు 5 నుంచి 6 గంటల పాటు అఘోషిత విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. అధికారులు చెబుతున్నది మెయింటెనెన్స్ పేరుతో అయినా, ప్రజలు మాత్రం నమ్మే పరిస్థితిలో లేరు.పగలు వచ్చే కరెంటు రాత్రికి ఉండదు, రాత్రి వచ్చే కరెంటు పగలు ఉండదు. దీంతో రైతులు, గృహ వినియోగదారులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పండుగ మండపాల నిర్వాహకుల ఆవేదన

వినాయక మండపాల ఏర్పాట్లు చివరి దశకు చేరాయి. లైటింగ్, డెకరేషన్, సౌండ్ సిస్టం అంతా కరెంటుతోనే నడుస్తుంది. కరెంటు కోతలతో పనులు ముందుకు సాగడం లేదని ఉత్సవ కమిటీలు వాపోతున్నాయి. "లక్షలు ఖర్చు పెట్టి మండపం కడుతున్నాం, కానీ కరెంటు ఉంటుందో లేదో తెలియదు" అని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రైతులకు,విద్యార్థులకు తిప్పలు

వరి నాట్లు వేసిన రైతులకు మోటార్లు తిరగక పంటలు ఎండిపోతున్నాయి. రాత్రి వేళ కరెంటు లేకపోవడంతో విద్యార్థులు చదువుకోలేక, మహిళలు వంట చేసుకోలేక అవస్థలు పడుతున్నారు. చిన్న పరిశ్రమలు, వెల్డింగ్ షాపులు మూతపడుతున్నాయి.

### అధికారుల నిర్లక్ష్యం - ప్రజల ఆగ్రహం

విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించగా సరైన సమాధానం ఇవ్వడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పండుగ సీజన్ లో కూడా కోతలు విధించడం దారుణమని మండిపడుతున్నారు. పండుగ వేళనైనా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, లేకపోతే విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.


### కరెంటు లేక కళ్ల ముందే పంట ఎండిపోతుంది



ఎకరం వరి పొలం వేసినా, నాట్లు వేసి 20 రోజులు అయ్యింది. నాట్లకు, ఎరువులకు, కూలీలకు కలిపి 25 వేల దాకా అప్పు చేసి పెట్టుబడి పెట్టినా.కానీ వారం రోజుల నుంచి కరెంటు సరిగా లేదు సార్. పగలు వస్తే 4–5 గంటలు వచ్చి పోతుంది, రాత్రి వస్తే మాకు పొలం కాడికి పోవడానికి భయం. మోటారు పెట్టాలంటే కరెంటు లేదు, వోల్టేజ్ లేదు.

- చారి శేఖర్ ,బోధంపల్లి యువ రైతు

### ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం



పండుగలు సమీపిస్తున్న వేళ కోమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో విద్యుత్ కోతలతో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల నిరంతర కరెంటు ఇచ్చాం. పండుగలకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశాం. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక మళ్లీ పాత రోజులు వచ్చాయి. కాగజ్ నగర్, సిర్పూర్, ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లో రోజుకు 5–6 గంటలు అఘోషిత కోతలు విధిస్తున్నారు.అని ఆయన విమర్శించారు.వినాయక మండపాల ఏర్పాట్లు జరుగుతున్నాయి, రైతులు వరి నాట్లు వేశారు. కరెంటు లేక మోటార్లు తిరగడం లేదు, మండపాల్లో లైటింగ్ పనులు ఆగిపోయాయి. విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు పట్టింపు లేదు. వెంటనే కోతలు ఆపి, నిరంతర విద్యుత్ ఇవ్వాలి. లేకపోతే ప్రజల తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం.

- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



## కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు.!

- కొండా దంపతుల తేల్చిచెప్పిన మాట
- రాహుల్ ను ప్రధాని చేయడమే లక్ష్యం
- పదవులు వస్తాయి.. పోతాయి.. విలువలకు మాత్రం కట్టుబడి ఉంటాం
- పదవి లేకపోయినా ప్రజల్లోనే ఉంటాం.. 24 మంది కార్పొరేటర్లను గెలిపిస్తాం
- కార్యకర్తలే మా బలం.. మమ్మల్ని నమ్ముకున్న వారికి అండగా ఉంటాం: కొండా మురళి, సురేఖ



**ప్రజా వాయిస్, హన్మకొండ:** రాజకీయ అనిశ్చితికి తెరదించుతూ కొండా దంపతులు కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి స్పష్టం చేశారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల్లోనే ఉంటామని, విలువలు, కృతజ్ఞతలకు కట్టుబడి రాజకీయాలు చేస్తామని తేల్చిచెప్పారు. వరంగల్‌లోని ఎం.కె. నాయుడు హోటల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొండా దంపతులు మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ తమకు ఎన్నో అవకాశాలు కల్పించిందని, పార్టీని వీడి వెళ్లే ఆలోచన తమకు లేదని కొండా మురళి స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తమ లక్ష్యమని ప్రకటించారు. పదవులు వస్తుంటాయని, పోతుంటాయని.. కృతజ్ఞత మాత్రం తమ కుటుంబ రక్తంలోనే ఉందన్నారు. తమను నమ్ముకుని ఉన్న నాయకులు, కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని చెప్పారు.

### 24 మంది కార్పొరేటర్లే లక్ష్యం

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను మరింత బలోపేతం చేస్తామని మురళి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 24 మంది కార్పొరేటర్లను గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. కష్టపడి పనిచేసే వారికే టికెట్లు దక్కుతాయని, అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగుతామని అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వారే కొండా దంపతుల అసలైన బలమని పేర్కొన్నారు.

### పదవి ఒక అలంకారం మాత్రమే

మంత్రి పదవి కోల్పోవడంపై కొండా సురేఖ తొలిసారి తన మనసులోని మాటను కార్యకర్తల సమక్షంలో వెల్లడించారు. పదవి పోయిందని తనకు బాధ లేదని, అయితే ఎలాంటి కారణం లేకుండా పదవి నుంచి తొలగించారన్న బాధ మాత్రం ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తనకు అప్పగించిన పదవికి ఎప్పుడూ మచ్చ తీసుకురాలేదని చెప్పారు.పదవి అనేది కేవలం అలంకారం మాత్రమే. పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లోనే ఉంటాం. మళ్లీ మంచి రోజులు వస్తాయి అని సురేఖ అన్నారు. గత పది రోజులుగా తమను నమ్ముకున్న కార్యకర్తలు మనోవేదనకు గురయ్యారని తెలిపారు.

### అవకాశవాద రాజకీయాలపై ఫైర్

ప్రస్తుత రాజకీయాల్లో అవకాశవాదం పెరిగిపోయిందని సురేఖ విమర్శించారు. ఉదయం ఒక పార్టీలో ఉండి సాయంత్రానికి మరో పార్టీలోకి మారే సంస్కృతి పెరిగిందన్నారు. తాము మాత్రం విలువలకు కట్టుబడి రాజకీయాలు చేస్తున్నామని స్పష్టం చేశారు.గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. అనంతరం రాజకీయ పరిణామాల్లో వరంగల్ తూర్పు నుంచి పోటీ చేసి అధికారంలో ఉన్న మంత్రిని ఓడించి గెలిచామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ మంత్రి బాధ్యతలు చేపట్టానన్నారు.

### మా మీద మాట్లాడే ముందు ఒళ్లు దగ్గర పెట్టుకోండి

కొండా దంపతులపై విమర్శలు చేస్తున్న నాయకులను సురేఖ తీవ్రంగా హెచ్చరించారు. తమ రాజకీయ ప్రయాణం విలువలతో ముడిపడి ఉందని, తమపై మాట్లాడే వారు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని అన్నారు. పార్టీ అధిష్ఠానం నుంచి ఫోన్లు వస్తున్నాయని, అయితే తాము కాంగ్రెస్‌ను వీడబోమని స్పష్టం చేశామని తెలిపారు.

### మురళికి త్వరలో చైర్మన్ పదవి.?

త్వరలోనే కొండా మురళికి చైర్మన్ పదవి దక్కుతుందని సురేఖ ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లకు పిలుపునిచ్చారు.నా శరీరంలో ఇంకా నాలుగు బుల్లెట్లు ఉన్నాయి అని మురళి భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. ప్రజలు, కార్యకర్తల ఆశీస్సులే తనకు బలమని చెప్పారు. కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ కార్యకర్తలకు అండగా ఉంటామని మరోసారి స్పష్టం చేశారు.కొండా దంపతుల తాజా ప్రకటనతో పార్టీ మార్పుపై కొంతకాలంగా సాగుతున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది. కాంగ్రెస్‌లోనే ఉంటామని వారు బహిరంగంగా ప్రకటించడంతో వరంగల్ తూర్పు రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది.



## గుడుంబా గుప్పిట్లో రామకృష్ణాపురం.!

- రవీంద్రఖని రైల్వే స్టేషన్ పరిధిలో యథేచ్ఛగా నాటుసారా విక్రయాలు
- పగటిపూటే బహిరంగంగా సాగుతున్న అక్రమ దందా
- గుడుంబా మత్తులో కుదేలవుతున్న కుటుంబాలు
- పెడదోవ పడుతున్న యువత
- కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ , పోలీసు శాఖలపై నిర్లక్ష్య ఆరోపణలు
- ఉన్నతాధికారులు స్పందించి ఉక్కుపాదం మోపాలని స్థానికుల డిమాండ్

**ప్రజా వాయిస్ / మంచిర్యాల్ క్రైమ్:** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపురం పరిధిలో గుడుంబా దందా జోరుగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రవీంద్రఖని రైల్వే స్టేషన్ ప్రాంతంలో నాటుసారా విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వ నిషేధం ఉన్నప్పటికీ అక్రమ వ్యాపారులు ఎలాంటి భయం లేకుండా దందా కొనసాగిస్తున్నారని వాపోతున్నారు.పగటిపూటే గుడుంబా విక్రయాలు జరుగుతుండటంతో యువత మద్యానికి బానిసై పెడదోవ పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాటుసారా మహమ్మారి కారణంగా పలు కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత బహిరంగంగా దందా సాగుతున్నా సంబంధిత శాఖలు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.అక్రమ గుడుంబా విక్రయాలపై ఎక్సైజ్, పోలీసు శాఖలు నామమాత్రపు తనిఖీలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రామకృష్ణాపురం–రవీంద్రఖని ప్రాంతంలో గుడుంబా విక్రయాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ దందాపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై కూడా విచారణ జరిపించాలని కోరుతున్నారు.

## కరాటేలో సత్తా చాటిన చలకుర్తి చిన్నారులు

- రెండు బంగారు పతకాలు సాధించిన విహాస్
- స్వర్ణం, రజతంతో మెరిసిన సుదీక్ష

**ప్రజా వాయిస్ | పెద్దవూర** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే ఛాంపియన్‌షిప్–2026 పోటీల్లో నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచారు.తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్, సైకో కాయ్ కరాటే ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో బీఎస్ఆర్ కరాటే అకాడమీ నిర్వహించిన ఈ పోటీల్లో పాతనబోయిన విహాస్ కటాస్, కుమితే విభాగాల్లో పోటీపడి రెండు బంగారు పతకాలు సాధించాడు. అలాగే పాతనబోయిన సుదీక్ష కుమితే విభాగంలో బంగారు పతకం, కటాస్ విభాగంలో వెండి పతకం సాధించి సత్తా చాటింది.ఈ సందర్భంగా విజేతలు మాట్లాడుతూ పోటీల్లో పతకాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. తమను నిరంతరం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, కరాటేలో అత్యుత్తమ మెళకువలు నేర్పిస్తూ విజయాల వైపు నడిపిస్తున్న కోచ్ మహేష్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారుల విజయాల పట్ల గ్రామస్థులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.




# కల్వకుంట్ల కవిత.. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు

- ముఖ్యమంత్రి, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు
- దొరల గడీలను బద్దలు కొట్టి ప్రజా పాలన తీసుకొచ్చాం
- ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై మాట్లాడాలి, వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి.
- బీసీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్.



**ప్రజా వాయిస్; ములుగు జిల్లా:/** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులపై కల్వకుంట్ల కవిత చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులపై మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ములుగు పట్టణ అధ్యక్షులు లావుడ్య రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వంగ రవి యాదవ్ మాట్లాడారు.

### గత పాలనను ప్రజలు మర్చిపోలేదు:

గత పాలనలో జరిగిన పరిణామాలను తెలంగాణ ప్రజలు మర్చిపోలేదని వంగ రవి యాదవ్ అన్నారు. గతంలో కల్వకుంట్ల కవిత మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. బతుకమ్మ పేరుతో గత పాలనలో జరిగిన వ్యవహారాలపై ప్రజలకు అనేక ప్రశ్నలు ఉన్నాయని అన్నారు. బతుకమ్మ పండుగను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చకుండా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని అన్నారు. గతంలో దొరల ఆధిపత్యంలో బతుకమ్మ జరిగిందని, నేడు బహుజనులు స్వేచ్ఛగా బతుకమ్మ పండుగను జరుపుకుంటున్నారని వంగ రవి యాదవ్ అన్నారు.

### దొరల గడీలను బద్దలు కొట్టి ప్రజా ప్రభుత్వం:

పదేళ్ల పాలనకు ముగింపు పలికి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. గత పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పకుండా ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని వంగ రవి యాదవ్ సూచించారు. ముఖ్యమంత్రి, మంత్రులను వ్యక్తిగతంగా విమర్శించడం ద్వారా రాజకీయంగా గొప్ప నాయకురాలిగా గుర్తింపు పొందుతానని భావించడం సరికాదన్నారు. రాజకీయ విమర్శలకు ప్రజాస్వామ్యంలో స్థానం ఉందని, అయితే వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు రాజకీయ విలువలను దిగజార్చే విధంగా ఉండకూడదని అన్నారు.

### వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి:

ఇకనైనా కల్వకుంట్ల కవిత తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు క్షమాపణ చెప్పాలని వంగ రవి యాదవ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం చెబుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కుతుబ్దిన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు షర్ఫుద్దీన్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జన్ను రవి, మైనార్టీ సెల్ ములుగు మండల అధ్యక్షులు సయ్యద్ షకీల్ అహ్మద్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదారపు రాజు, కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండెబోయిన రమేష్, ములుగు పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోయిని రాజు, మైనార్టీ సెల్ ములుగు పట్టణ అధ్యక్షులు హాజీ పాషా, కాంగ్రెస్ జిల్లా నాయకులు గూడెల్లి ఓదెలు, కొత్తకొండ రమేష్, బొంతల వేణు, అలవాల రాజ్ కుమార్, రాజు, మైనార్టీ సెల్ నాయకులు జాఫర్, ఉస్మాన్, బాబా తదితరులు పాల్గొన్నారు.

# భూములు పోతే.. బతుకులు ఆగిపోతాయి!

- పరిశ్రమల కోసం మా జీవనాధారాన్ని లాక్కోవద్దు
- టీజీఐఐసీ భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలి
- అర్ధరాత్రి దాటినా ఆందోళన కొనసాగించిన కాల్లాపూర్ రైతులు
- రైతుల ఉసురు పోసుకోవద్దు: ముకుంద నాగేశ్వర్




**ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో** :ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో రైతుల భూములను సేకరించేందుకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పరిగి మండలం కాల్లాపూర్ గ్రామ రైతులు తీవ్ర ఆందోళనకు దిగారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ రాత్రి 10 దాటినా ధర్నా నిర్వహించారు.టీజీఐఐసీ కోసం భూసేకరణ చేపడుతున్న ప్రభుత్వం ముందుగా గ్రామ సభలు నిర్వహించాలని, రైతులకు పూర్తి సమాచారం అందించాలని, భూములకు న్యాయమైన పరిహారం ప్రకటించి చెల్లించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ఎలాంటి డీపీఆర్ లేకుండా, ఏ పరిశ్రమలు ఏర్పాటు చేస్తారనే స్పష్టత లేకుండా రైతుల భూములను సేకరించడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### డీపీఆర్ లేకుండా భూసేకరణ ఎలా?

స్థానిక ఎమ్మెల్యే శాసనసభలో భూములను తీసుకున్నామని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రస్తావించడం భూసేకరణ చట్టాలు, రైతుల హక్కులపై అవగాహన లేమికి నిదర్శనమని తెలంగాణ ఉద్యమకారులు, బీజేపీ నాయకులు విమర్శించారు. ప్రజలతో చర్చించకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా, పరిహారం చెల్లించకుండా భూములను సేకరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని అన్నారు.రైతుల భూములు కేవలం ఆస్తులు కాదని, వారి జీవనాధారమని పేర్కొంటూ రైతుల రాజ్యాంగబద్ధ, ప్రజాస్వామిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు అన్నారు.వికారాబాద్ జిల్లా పాలనాధికారి వెంటనే స్పందించి టీజీఐఐసీ కోసం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, రైతులతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారులు, పరిగి బీజేపీ నాయకుడు ముకుంద నాగేశ్వర్ డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రభుత్వం ముందుకు వెళితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నేచురల్ పేరుతో.. నకిలీ మందుల దందా.!

- పెద్దాపూర్ లో 'కిసాన్ ఆగ్రో ట్రేడర్స్' పై రైతు ఫిర్యాదు
- ల్యాబ్ పరీక్షల్లో ప్రమాదకర రసాయనాల ఆనవాళ్లు.. కలకలం
- ఫిర్యాదు సమాచారం ముందే లీక్ చేశారంటూ వ్యవసాయ అధికారిపై ఆరోపణలు
- సంస్థను సీజ్ చేసి.. అధికారిపై శాఖాపరమైన విచారణ జరపాలని కలెక్టర్ కు వినతి




**ప్రజా వాయిస్, సంగారెడ్డి:** రైతులను మోసం చేస్తూ 'నేచురల్ ప్రొడక్ట్స్' పేరుతో రసాయన పురుగుమందులను విక్రయిస్తున్నారంటూ సంగారెడ్డి జిల్లా పెద్దాపూర్‌లోని ఓ సంస్థపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. నిషేధిత రసాయనాలను సహజసిద్ధమైన ఉత్పత్తులుగా ప్రచారం చేస్తూ రైతులకు విక్రయిస్తున్నారని సదాశివపేట మండలం వెల్టూర్‌కు చెందిన రైతు ఎం.డి. అహ్మద్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో సంబంధిత వ్యవసాయ అధికారి పాత్రపైనా అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ సమగ్ర విచారణకు డిమాండ్ చేశారు.

### ల్యాబ్ పరీక్షల్లో వెలుగులోకి..

పెద్దాపూర్ కేంద్రంగా 'కిసాన్ ఆగ్రో ట్రేడర్స్ (Spark M/s. Vivata Crop Sciences Pvt. Ltd)' పేరుతో విక్రయిస్తున్న ఉత్పత్తుల నమూనాలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (NIPHM) ల్యాబ్‌లో పరీక్షించినట్లు రైతు తెలిపారు. పరీక్షల్లో అబామెక్టిన్ 134.86, క్లోరాంట్రానిలిప్రోల్ 1.70, థయామెథాక్సమ్ 130.33, లాంబ్డా సైహలోథ్రిన్ 1.60, సైపర్‌మెథ్రిన్ 3.61 ఉన్నట్లు నివేదికలో తేలిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### ఫిర్యాదు ముందే లీక్ చేశారంటూ..

ఈ నెల 7న మండల ప్రజావాణిలో మండల వ్యవసాయ అధికారి జి. రమేష్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు అహ్మద్ తెలిపారు. అయితే తన ఫిర్యాదు సమాచారం ముందుగానే సంస్థ నిర్వాహకులకు చేరిందని ఆరోపించారు. అధికారులు తనిఖీకి వెళ్లేలోపే షాపులోని రసాయన నిల్వలను మరోచోటికి తరలించేందుకు సహకరించారని పేర్కొన్నారు. ప్రస్తుతం దుకాణంలో నిల్వలు లేవనే కారణంతో వ్యాపారం కొనసాగించేందుకు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు.

### సీజ్ చేసి చర్యలు తీసుకోవాలి

రైతుల ఆరోగ్యం, పంటల భద్రతకు ముప్పు కలిగించే విధంగా అక్రమంగా మందులు విక్రయిస్తున్న సంస్థపై సమగ్ర విచారణ జరిపి, నిజాలు తేలితే వెంటనే సీజ్ చేయాలని అహ్మద్ కలెక్టర్‌ను కోరారు. అలాగే తన ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మండల వ్యవసాయ అధికారి జి. రమేష్‌పై శాఖాపరమైన విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# చెరువు కాదు.. కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి.!

- చిన్నపాటి వర్షానికే జలమయం
- బృందావన్ కాలనీవాసులకు నరకయాతన
- వినాయక చవితి వేళ దేవాలయానికి వెళ్లేందుకు అవస్థలు
- కమిషనర్ కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరా?
- స్పందించకుంటే ఆందోళన తప్పదన్న 12వ వార్డు కౌన్సిలర్



**ప్రజా వాయిస్, సంగారెడ్డి:** చూస్తే చెరువులా కనిపిస్తుంది.. కానీ అది చెరువు కాదు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని బృందావన్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి! శనివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.చిన్నపాటి వర్షానికే రహదారి మొత్తం జలమయం కావడంతో కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో కాలు తీసి కాలు పెట్టలేని పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. ఆదివారం వినాయక చవితి పండగ నేపథ్యంలో దేవాలయానికి వెళ్లే భక్తులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.రోడ్డు దుస్థితిని పలుమార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని కాలనీవాసులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి దేవాలయానికి వెళ్లేందుకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన చేపట్టాల్సిన పరిస్థితి వస్తుందని 12వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పొన్నం దేవేందర్ రెడ్డి హెచ్చరించారు. వెంటనే అధికారులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

# రోడ్ల నిర్మాణం కు వీడని గ్రహణం

- నిధులు మంజూరైన పనులు ప్రారంభించారా...?
- గత మూడేళ్ల క్రితం నిధులు మంజూరు అయిన పూర్తికాని మునిపల్లి బుసిరెడ్డిపల్లి ప్రధాన రహదారి
- మంత్రి - దామోదర్ శంకుస్థాపన చేసిన రోడ్డుకు మోక్షం లేదు
- సోషల్ మీడియాలో మాత్రం మా మంత్రి దామోదర్ అందమైన రోడ్లు వేశారని ప్రచారం
- ప్రస్తుతం ఉన్న రోడ్లను చూపించిన బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు
- జోగిపేట సిఐ పోలీస్ కాదు కాంగ్రెస్ ఏజెంట్గా పని చేస్తున్నారంటూ ఆరోపణలు



**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** అందరూ నియోజకవర్గంలోని పలు రోడ్ల నిర్మాణంకు నిధులు మంజూరు అయిన పనులు ప్రారంభించిన గ్రహణం పట్టింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ ఆయాయంలో గ్రామీణ ప్రాంతాలకు లింకు రోడ్ల మరమ్మతుల కోసం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు. దీనికి ప్రధానంగా మునిపల్లి నుండి సింగూర్ ప్రాజెక్ట్ కొచ్చే పర్యాటకులకు అనుకూలంగా ఉండే విధంగా మునుపల్లి మండల కేంద్రం నుంచి బుసరెడ్డిపల్లి హరిత రెస్టారెంట్ వరకు 22 కిలోమీటర్లు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. దీనికోసం అప్పటి ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్ రావు తో పాటు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పనులు ప్రారంభించేందుకు శంకుస్థాపన సైతం చేశారు. పనులు ప్రారంభించిన ఎన్నికల కోడ్ సమీపిస్తున్నందున టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ను ఎన్నికలు పూర్తయ్యే వరకు ఈ రోడ్డు వేయవద్దంటూ ప్రస్తుత మంత్రి దామోదర్ హెచ్చరించారు. దీంతో కాంట్రాక్టర్ రాజకీయ వ్యవహారాలతో ముడిపడి ఉన్నందున పనులు చేసిన బిల్లు రాకపోతే నష్టపోయేది తానే అనుకొని అర్ధాంతరంగా రోడ్డు పనులను నిలిపివేశాడు. అంటే దాదాపుగా మూడు సంవత్సరాలు గడిచిన మంత్రికి మునిపల్లి టు సింగూర్ పనులను పూర్తి చేయించాలన్న ఉద్దేశం మాత్రం మంత్రిలో కనిపించలేదు. ఎన్నికల అనంతరం ఆత్మకూరు నుంచి సింగూర్ ప్రాజెక్టు వరకు బిటి రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తో కలిసి శంకుస్థాపన చేసిన ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. రోడ్డు వెంట వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. సదాశివాపేట సమీప ప్రాంతంలోని పలు పరిశ్రమలు కొత్తగా ఏర్పడ్డాయి. కార్మికుల కోసం పరిశ్రమ యాజమాన్యాలు బస్సులను ఏర్పాటు చేశారు. బస్సులు ఇదే దారిలో వెళ్ళేది... కానీ వచ్చేవరకు కూడా గ్యారెంటీ ఉండదు. అలాంటి పరిస్థితుల్లో ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది కానీ.. ఎవరు కమిషన్ల కోసం వాళ్లు ప్రయత్నిస్తారు. ఒక మంత్రిగా ఉండి కనీసం తన నియోజకవర్గంలో రోడ్లు బాగు చేయాలన్న ఉద్దేశం ఉండి నిధులు మంజూరు చేయించిన పనులు మాత్రం ఎందుకు పూర్తి చేయించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మంత్రికి కమిషన్ ఇవ్వకపోవడమే వల్లే పనులు జరుపుకుండా అడ్డుకున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. తాజాగా అందోల్ మండలం సంగుపేట నుంచి పోచారం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తే మండల నాయకులు పనులు ప్రారంభించేందుకు కొబ్బరికాయలు కొట్టారు. ఎక్కడికి అక్కడ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. ఫలితంగా ఈ రోడ్డు పనులు కూడా పూర్తి స్థాయిలో జరిగే అవకాశం లేదు. ఇప్పటికే బుసరెడ్డిపల్లి నుంచి ఆత్మకూరు వరకు రోడ్డు తవ్వేసి వదిలేశారు. నాలుగు సంవత్సరాలుగా హరిత రెస్టారెంట్ నుంచి మునిపల్లి వరకు రోడ్డు తవ్వి పన్ను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్న కాంట్రాక్టర్ ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయా లేదా అన్న అనుమానంతో పనులు నిలిపివేశాడు. అల్లాదుర్గం మండల పరిధిలోని వట్టిపల్లి వెళ్లే ప్రధాన రహదారి పై గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ఇప్పటివరకు పనులు మాత్రం పూర్తి కాలేదు. దీంతో ఆ రహదారి వెంట వెళ్లాలంటేనే వాహనదారులు వణికిపోతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో... గుంత ఎక్కడ ఉన్నదో తెలియదు దీంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల గురై మరణాలు కూడా సంభవించాయి. ఒక ఏడాది కాలంలోనే 72 మంది ఈ రోడ్ ప్రమాదంలో మరణించిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా మంత్రి స్పందించి విధులు మందిరై అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయించేందుకు కృషిచేయవలసిన బాధ్యత మంత్రిపై ఉంది.



# నిప్పులార్పే శాఖలో నిర్లక్ష్యపు తిష్ట!

- అగ్నిమాపక కేంద్రంలో ప్రైవేటు కార్ల పాగా?
- ప్రభుత్వ డ్రైనేజీకి తూట్లు.. ఎవరి కోసం ఈ దారి?
- ఫైర్ స్టేషన్ లో ప్రైవేటు కార్లు.. అధికారులకు కనిపించవా?

**ప్రజా వాయిస్ ఖమ్మం:** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలోని అగ్నిమాపక నియంత్రణ కేంద్రం కార్ గ్యారజేగా, ప్రైవేటు వాహనాల పార్కింగ్ అడ్డాగా మారిందనే విమర్శలు తీవ్రస్థాయిలో వెల్లువెత్తుతున్నాయి. అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తుల వంటి ఆపత్కాలంలో నిమిషాల వ్యవధిలో దూసుకెళ్లాల్సిన ఫైరింజన్ ప్రాంగణంలోనే నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు కార్లు తిష్టవేయడం స్థానికంగా తీవ్ర అభ్యంతరాలకు దారితీస్తోంది. ప్రభుత్వ కార్యాలయ ఆవరణను ఇలా ప్రైవేటు వ్యక్తుల వాహనాల నిలుపుదలకు వినియోగిస్తుండటంపై స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్రమంలో వాహనాల రాకపోకల పేరిట ప్రజా ఆస్తులను సైతం లెక్కచేయకుండా ధ్వంసం చేసిన తీరు విస్మయానికి గురిచేస్తోంది. కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ సైడ్ డ్రైనేజీని ఏకంగా పగులగొట్టి, కాలువ మధ్యలో నాసిరకం సిమెంట్ తూమును అమర్చి, దానిపై మట్టి పూడ్చి రాకపోకల దారిగా మార్చేశారు. అయితే ప్రజల పన్నుల నిధులతో ప్రజా అవసరాల నిమిత్తం నిర్మించిన డ్రైనేజీలో ఈ స్థాయి మార్పులు చేయడానికి అసలు సంబంధిత శాఖల నుంచి అధికారిక అనుమతులు ఉన్నాయా? లేక నిబంధనలను తుంగలో తొక్కి సొంత ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తిని నాశనం చేశారా? అనే ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు.అత్యవసర సేవలకు కేటాయించిన ప్రాంగణంలో అనధికారిక వాహనాల పార్కింగ్‌కు అనుమతించడం వెనుక ఆంతర్యమేమిటో విపత్తు నియంత్రణ శాఖ అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని, ప్రభుత్వ డ్రైనేజీని పగులగొట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని మురుగు కాలువను పునరుద్ధరించాలని నేలకొండపల్లి ప్రజలు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

# తెలకపల్లిలో 'ఆర్ఎంపీ'ల దందా.!

- అర్హత లేకున్నా డాక్టర్ల అవతారం
- ఇంజెక్షన్లు, యాంటిబయాటిక్స్ తో వైద్యం
- చిన్న జబ్బులకే ఖరీదైన ట్రీట్ మెంట్
- రోగుల నుంచి రూ.300, 1,500 వరకు వసూళ్లు
- లైసెన్సుల్లేని క్లినిక్ లు, మెడికల్ షాపులపై నిఘా ఏదీ?
- అధికారుల తీరుపై అనుమానాలు
- గతంలో వైద్యం వికటించి మృతి, చిన్నారుల పరిస్థితి విషమించిందని ఆరోపణలు
- ఆకస్మిక తనిఖీలు చేసి అక్రమ క్లినిక్ లను సీజ్ చేయాలి
- జిల్లా కలెక్టర్ , డీఎంహెచ్ఓ కు ప్రజల విజ్ఞప్తి




**ప్రజా వాయిస్,తెలకపల్లి:** తెలకపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో అర్హత లేని వ్యక్తులు వైద్యులుగా చలామణి అవుతున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఎంబీబీఎస్ అర్హత, వైద్య మండలి రిజిస్ట్రేషన్ లేకుండానే ప్రైవేట్ క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల పేరుతో వైద్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోనే ఇలాంటి క్లినిక్‌లు 15 నుంచి 20 వరకు ఉన్నాయని వారు చెబుతున్నారు.పదో తరగతి, ఇంటర్ చదివి ప్రైవేట్ ఆసుపత్రుల్లో కంపౌండర్లుగా పనిచేసిన కొందరు.. అనంతరం సొంతంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని వైద్యులుగా చలామణి అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జ్వరం, జలుబు, దగ్గు, కడుపునొప్పి వంటి సాధారణ సమస్యలకే యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, సెలైన్‌లు వినియోగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### టెస్టులు లేకుండానే వ్యాధి నిర్ధారణ.?

కొన్ని క్లినిక్‌లలో సరైన ల్యాబొరేటరీ పరీక్షలు నిర్వహించకుండానే టైఫాయిడ్, మలేరియా అంటూ రోగులను భయపెట్టి చికిత్స పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఒక్కో రోగి నుంచి రూ.300 నుంచి రూ.1,500 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. లైసెన్సులపై స్పష్టత లేని మెడికల్ షాపుల్లోనే మందులు విక్రయిస్తూ, ఇంజెక్షన్లు కూడా ఇస్తున్నారని చెబుతున్నారు.

### గత ఘటనలపై ఆందోళన

గతంలో మండలంలో వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలపై పూర్తిస్థాయి విచారణ జరగాలని వారు కోరుతున్నారు. అర్హత లేని వైద్యులపై చర్యలు తీసుకోవాలని గతంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

### ప్రభుత్వ వైద్యం బలహీనమేనా..?

ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అత్యవసర సమయాల్లో నాగర్‌కర్నూల్, హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఆర్‌ఎంపీలు పెద్ద వైద్యులుగా చలామణి అవుతున్నారని విమర్శిస్తున్నారు.


### తనిఖీలు చేపట్టాలని డిమాండ్

తెలకపల్లి మండలంలోని అన్ని ప్రైవేట్ క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, మెడికల్ షాపులపై జిల్లా కలెక్టర్, DMHO, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అర్హతలు, అనుమతులు లేని క్లినిక్‌లను మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని యువకులు, ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

# బెల్ట్ షాపుల దందాకు మద్యం బాటిళ్ల పై రహస్య స్టిక్కర్లా?

- స్టిక్కర్ల పై సమగ్ర విచారణ చేసి ప్రజల ముందు ఉంచాలి
- ప్రజల ఆరోగ్యం ముఖ్యమా? మద్యం వ్యాపారుల లాభం ముఖ్యమా?
- గుడుంబా పై ఉక్కు పాదం.. బెల్ట్ షాప్ లపై ఎందుకు అధికారుల మౌనం?
- ప్రజావాణి ఫిర్యాదుకు స్పందన కరువు
- ఎక్సైజ్ అధికారుల మౌనం వెనుక అసలు కథ ఏమిటి?
- వైన్స్ షాపుల యజమాన్యం అందిస్తున్న మామూళ్ల మత్తులో అధికారులు ఉన్నారా?
- కలెక్టర్ సాబ్ ఇప్పటికైనా మీరు స్పందించి బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి.



**ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరో** మద్యం బాటిళ్ల పై కనిపిస్తున్న ప్రత్యేక స్టిక్కర్లు ఇప్పుడు జనగామ జిల్లాలో పాలకుర్తి, కొడకండ్ల, దేవురుప్పుల మండలాలలో మద్యం దుకాణాల నుండి బెల్టు షాపులకు మద్యం సరఫరా పై చర్చనీయాంశంగా మారాయి. మద్యం దుకాణాల నుంచి గ్రామాల్లోని బెల్ట్ షాపులకు మద్యం తరలింపులో ఈ స్టిక్కర్ల పాత్ర ఏమిటి? వీటిని ఎవరు వేస్తున్నారు? అధికారిక గుర్తు లా.. లేక అక్రమ సరఫరాకు సంకేతాలా? స్టిక్కర్ల వెనుక కోట్ల రూపాయల అక్రమ మద్యం దందా నడుస్తోందా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గత ఏప్రిల్, మే,లోనే జనగామ కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు కనిపించకపోవడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### స్టిక్కర్ల వెనుక అసలు కథేంటి?

మద్యం బాటిళ్ల పై సాధారణ ఎక్సైజ్ లేబుళ్ల కు అదనంగా కనిపిస్తున్న ప్రత్యేక స్టిక్కర్ల పై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఫొటోల్లో కనిపిస్తున్న స్టిక్కర్ పై గుర్తులు, అక్షరాలు ఉన్నాయి. ఈ స్టిక్కర్ అధికారికంగా ఎక్సైజ్ శాఖ అనుమతించినదేనా? ఎవరి ఆదేశాలతో వేస్తున్నారు? ఏ ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నారు? లేదా వైన్స్ యజమాన్యంతో కుమ్మక్కయ్యారా? అన్నది తేలాల్సి ఉంది. అక్రమ సరఫరాకు ఉపయోగించే గుర్తులైతే వాటి వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను బయటకు తీయాలి. అధికారిక గుర్తు లైతే వాటి ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలి.

### ఏప్రిల్ , మే, లో ఫిర్యాదుకు ఇంతవరకు స్పందన ఏదీ?

మద్యం బాటిళ్ల పై స్టిక్కర్ల వ్యవహారంపై గత ఏప్రిల్ మే లో జనగామ కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు ఫిర్యాదు దారుడు తెలిపారు. జనగామ ఎక్సైజ్ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు సమస్యపై స్పష్టమైన విచారణ, చర్యల వివరాలు వెల్లడించలేదని ఆరోపిస్తున్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించాల్సిన బాధ్యత లేదా? ఫిర్యాదుదారుడికి సమాధానం ఇవ్వకుండా ఫైళ్లను పక్కన పెట్టడమేనా ప్రజావాణి ఉద్దేశం? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### గుడుంబా పై ఉక్కుపాదం.. బెల్ట్ షాపులపై ఎందుకు మౌనం?

గుడుంబా తయారీ, అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం కూడా మత్తు పదార్థాలు, అక్రమ మద్యం నిర్మూలనపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటిస్తోంది. మరి గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న బెల్ట్ షాపులపై అదే స్థాయిలో దృష్టి ఎందుకు పెట్టడం లేదు? మద్యం దుకాణాల నుంచి గ్రామాలకు సరఫరా జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నప్పుడు తనిఖీలు, రికార్డుల పరిశీలన, అక్రమ విక్రయాలపై చర్యలు ఎక్కడ? అధికారులు నిద్రమత్తులో ఉన్నారా.. లేక మామూళ్ల మత్తులో ఉన్నారా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

### బెల్ట్ షాపుల వల్ల రోడ్డున పడుతున్న కుటుంబాలు

గ్రామాల్లో బెల్ట్ షాపుల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించాల్సిన వారు మద్యానికి బానిసలై సంపాదనను కోల్పోతున్నారు. ఇంట్లో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు, మహిళలపై వేధింపులు, పిల్లల చదువులకు ఆటంకాలు పెరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. యువత కూడా మద్యం మత్తుకు బానిసై చదువులు, ఉపాధి అవకాశాలను దూరం చేసుకునే ప్రమాదం ఉంది. మద్యం విక్రయాలపై నియంత్రణ లేకపోతే గ్రామీణ సమాజం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది.

### ప్రజల ఆరోగ్యమా.. మద్యం వ్యాపారుల లాభాలా?

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడంలో విఫలమైతే బాధ్యత ఎవరిది? బెల్ట్ షాపుల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందా.. లేక కొందరి అక్రమ వ్యాపారాలకు లాభాలు చేకూరుతున్నాయా? మద్యం బాటిళ్ల పై ఉన్న స్టిక్కర్ల వ్యవహారాన్ని కూడా ఇదే కోణంలో సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులను నియంత్రిస్తామని చెప్పే ప్రభుత్వం క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోకపోతే ప్రకటనలకే పరిమితమవుతుందన్న విమర్శలు తప్పవు.

### స్టిక్కర్ల పై సమగ్ర విచారణకు డిమాండ్

మద్యం బాటిళ్ల పై కనిపిస్తున్న స్టిక్కర్ల పై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. స్టిక్కర్లు ఎక్కడ తయారవుతున్నాయి? ఎవరు వేస్తున్నారు? ఏ దుకాణాల నుంచి ఏ గ్రామాలకు మద్యం తరలిస్తున్నారు? వాటి వెనుక ఎవరున్నారు? అన్న వివరాలను సేకరించాలి. బార్‌కోడ్, బ్యాచ్ నంబర్, బాటిల్ లేబుల్, విక్రయ బిల్లులు, స్టాక్ రిజిస్టర్ల ను పరిశీలించాలి. అవసరమైతే అనుమానాస్పద బాటిళ్లను స్వాధీనం చేసుకుని ప్రయోగశాల పరీక్షలు నిర్వహించాలి.అక్రమ సరఫరా నిర్ధారణ అయితే మద్యం దుకాణాల లైసెన్సు లపై చర్యలు, అక్రమ విక్రయదారుల పై కేసులు, సరఫరా నెట్‌వర్క్‌పై దర్యాప్తు చేపట్టాలి. గత ఏప్రిల్, మే,లో ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలను ప్రజలకు వెల్లడించాలి.

### బెల్ట్ షాపులపై ప్రజలు ఏం చేయాలి?

గ్రామాల్లో అనుమతిలేని మద్యం విక్రయ కేంద్రాల వివరాలను సంబంధిత ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయాలి.మద్యం బాటిళ్లపై అనుమానాస్పద స్టిక్కర్లు, బిల్లులు, విక్రయ వివరాలు ఉంటే సురక్షితంగా ఆధారాలు సేకరించి అధికారులకు అందించాలి.మైనర్లకు మద్యం విక్రయిస్తే వెంటనే పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.అక్రమ మద్యం విక్రయాలపై గ్రామసభల్లో చర్చించి, ప్రజలంతా కలిసి అధికారులపై చర్యలకు ఒత్తిడి తీసుకురావాలి.కుటుంబాల్లో మద్యం వల్ల సమస్యలు ఎదురైతే బాధితులకు సహాయం అందించి, అవసరమైతే మద్యపాన విముక్తి సేవలను ఆశ్రయించాలి.

### ఎక్సైజ్ అధికారులకు ప్రజల ప్రశ్న:

గుడుంబా తయారీ దారుల పై చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, బెల్ట్ షాపులకు మద్యం చేరుతున్న మార్గాలను ఎందుకు మూసివేయడం లేదు? స్టిక్కర్ల పై ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం వెనుక కారణమేంటి? జనగామ జిల్లా ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా మేల్కొని నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలి. ప్రజల ఆరోగ్యాన్ని, కుటుంబాల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# మధుర గానంతో మిర్యాలగూడ మంత్రముగ్ధం

- స్వర రాగ స్రవంతి-సీజన్-2 సంగీత విభావరి ఘనంగా నిర్వహణ
- ప్రముఖులకు ఘన సన్మానం

**మిర్యాలగూడ, ప్రజా వాయిస్:** మిర్యాలగూడలోని శ్రీనివాస కల్చరల్ ఎయిర్ కండిషన్డ్ మినీ స్టూడియోలో ఆదివారం నిర్వహించిన "స్వర రాగ స్రవంతి–సీజన్–2" సంగీత విభావరి నేత్రపర్వంగా జరిగింది. గాయనీ గాయకులు తమ మధురమైన గానంతో సంగీతాభిమానులను అలరించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది నేతి సత్యనారాయణ, విశ్రాంత రిటైర్డ్ రెవెన్యూ అధికారి చీదెళ్ల ఓంప్రకాష్‌లను స్టూడియో యాజమాన్యం, గాయనీగాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని స్టూడియో యజమానులు వై. శ్రీనివాసరావు, వై. విఘ్నేష్ నిర్వహించగా, కందుకూరి సుదర్శన్ పర్యవేక్షించారు. సంగీత విభావరిలో జ్యోతి, మౌనిక, సరస్వతి, నాగమణి, శైలజ, రమేష్ శర్మ, కంబాల శ్రీనివాస్, కొట్టు లక్ష్మీనారాయణ, అలుగుబెల్లి వెంకటరెడ్డి, అబ్రహం, కలకొండ శ్రీనివాస్, వంగూరి శ్రీనివాస్ తదితర గాయనీగాయకులు పాల్గొని తమ గానంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. న్యాయవాదులు రాయారపు భాస్కర్, తడకమళ్ళ రామ రంగారావుతో పాటు పలువురు సంగీతాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంగీత విభావరిని ఆస్వాదించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగిన స్వర రాగ స్రవంతి–సీజన్–2 విజయవంతంగా ముగిసింది.



# రామప్ప శిల్పకళా వైభవం అద్భుతం

- భారత్ దర్శన్ లో భాగంగా రామప్పకు గ్రూప్–2 అధికారులు
- కాకతీయుల కళా నైపుణ్యాన్ని ఆసక్తిగా తెలుసుకున్న అధికారులు.

**ప్రజా వాయిస్; ములుగు జిల్లా:** వెంకటాపురం మండలం పాలంపేటలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న గ్రూప్–2 అధికారులు ఆదివారం సందర్శించారు. భారత్ దర్శన్‌లో భాగంగా రామప్పకు వచ్చిన అధికారులు ఆలయ శిల్పకళా వైభవాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆలయానికి చేరుకున్న అధికారులకు అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ నిర్మాణ విశిష్టత, శిల్పాల ప్రత్యేకతలను అధికారులు పరిశీలించారు.

### కాకతీయుల నిర్మాణ నైపుణ్యంపై అవగాహన:

అసిస్టెంట్ పర్యాటక ప్రోత్సాహక అధికారి కుసుమ సూర్య కిరణ్, పర్యాటక మార్గదర్శి గోరంట్ల విజయ్ కుమార్ రామప్ప దేవాలయ చరిత్ర, కాకతీయుల నిర్మాణ శైలి, ఆలయంలోని శిల్పాల విశిష్టత, దేవాలయ నిర్మాణంలో ఉపయోగించిన సాంకేతిక నైపుణ్యాల గురించి అధికారులకు వివరించారు. రామప్ప శిల్పాల్లో కనిపించే కళాత్మకత, నాటి శిల్పుల ప్రతిభ, ఆలయ నిర్మాణ ప్రత్యేకతలను అధికారులు ఆసక్తిగా తెలుసుకున్నారు.

### రామప్ప చెరువులో బోటింగ్:

అనంతరం గ్రూప్–2 అధికారులు రామప్ప చెరువును సందర్శించారు. చెరువు అందాలను తిలకిస్తూ బోటింగ్ చేశారు. చారిత్రక వారసత్వం, ప్రకృతి అందాలతో అలరారుతున్న రామప్ప ప్రాంతాన్ని సందర్శించడం పట్ల అధికారులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్, శిక్షణ సంస్థ అధికారులు, పర్యాటక పోలీసులు అరుణ్, శ్రీకాంత్, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, పర్యాటక శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బస్ సెంటర్‌కు అడ్డంకులెందుకు.?



- పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు రాజకీయ అడ్డంకులు
- అమర్చిన పైపుల తొలగింపు.. చిలుకూరులో చర్చనీయాంశం
- ప్రజా అవసరాల పనులను నిలిపివేసే అధికారం ఎవరికి.?
- వివాదంపై అధికారులు విచారణ చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్

**ప్రజా వాయిస్,చిలుకూరు:**ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో గ్రామపంచాయతీ చేపట్టిన బస్ సెంటర్ ఏర్పాటుకు అడ్డంకులు ఎదురయ్యాయి. పనుల్లో భాగంగా పంచాయతీ సిబ్బంది అమర్చిన పైపులను బీఆర్ఎస్, సీపీఐ నాయకులు తొలగించినట్లు ఆరోపణలు రావడంతో స్థానికంగా చర్చ మొదలైంది.

### అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి..

పంచాయతీ ఆధ్వర్యంలో ప్రజా అవసరాల కోసం చేపడుతున్న పనులపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులను ఆశ్రయించాల్సి ఉండగా, ఏర్పాటు చేసిన పైపులను తొలగించడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పనుల్లో రాజకీయ జోక్యం తగదని పేర్కొంటున్నారు.

### ప్రయాణికులకు ఉపయోగకరం

బస్ సెంటర్ పూర్తయితే మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులకు సౌకర్యం కలగడంతోపాటు రవాణా వ్యవస్థ మరింత క్రమబద్ధంగా మారే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన పనులను వివాదాల్లోకి లాగకుండా సమస్యను అధికారుల సమక్షంలో పరిష్కరించాలని కోరుతున్నారు.

### అధికారుల విచారణకు డిమాండ్

పైపులు ఎవరి అనుమతితో తొలగించారు? తొలగించే అధికారం ఎవరికి ఉంది? బస్ సెంటర్ ఏర్పాటుకు పంచాయతీ తీసుకున్న అనుమతులేమిటి? తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా విచారణ జరపాలని గ్రామస్థులు కోరుతున్నారు. వాస్తవాలను వెలుగులోకి తెచ్చి అభివృద్ధి పనులు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# కనుమరుగవుతున్న ఓ తరం..!

- ఆ తరం వెళ్లిపోతే.. విలువలూ వెళ్లిపోతాయా
- సాంకేతికత లేకున్నా సంతోషంగా బతికిన నాటి జీవితం
- బంధాలు.. బాధ్యతలు.. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం
- ఆ తరం నుంచి నేర్చుకోకపోతే.. భవిష్యత్తు అంధకారమే!



**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్:** ఒక్కొక్కరుగా శాశ్వత వీడ్కోలు పలుకుతూ ఓ అపురూపమైన తరం కనుమరుగవుతోంది. సౌకర్యాలు తక్కువైనా సంతోషానికి కొదవలేని జీవితం గడిపిన తరం అది. 'నేను' కంటే 'మనం' అనే మాటకే విలువిచ్చిన తరం. డిగ్రీలు లేకపోయినా జీవితాన్ని చదివిన వారు.. గడియారాలు లేకున్నా సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారు.. ఇంటర్నెట్ లేకున్నా జ్ఞానాన్ని సంపాదించిన వారు.మొబైల్ ఫోన్లు, టీవీలు, ఏసీలు, కూలర్లు, జీపీఎస్‌లు, కాలిక్యులేటర్లు లేని రోజుల్లోనూ తమ జీవితాలను ఎంతో సంతృప్తిగా గడిపారు. బావులు, చెరువుల నీటినే తాగి ఆరోగ్యంగా జీవించారు. పిజ్జాలు, బర్గర్లకు బదులు పీచుమిఠాయిలు, పేలాలు వంటి చిరుతిళ్లతో ఆనందించారు. రాత్రివేళ ఇంటి అరుగులపై కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ ఆప్యాయతలను పంచుకున్నారు.

### బాధ్యతలే బలంగా..

పిల్లల బాల్యాన్ని ఆటపాటలతో నింపిన ఆ తరం.. సర్కారు బడుల్లో చదివించి విద్యతో పాటు క్రమశిక్షణను నేర్పింది. ఉపాధ్యాయుడు మందలిస్తే ఇంట్లో తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరించేవారు. కిలోమీటర్ల దూరాన్నీ నడకతోనే అధిగమించేవారు. కష్టపడి పనిచేయడాన్నే వ్యాయామంగా భావించేవారు.

### బంధాలే ఆస్తులు..

ఉమ్మడి కుటుంబాల్లో చిన్నా పెద్దా కలిసి జీవించిన రోజులు అవి. భేదాభిప్రాయాలున్నా అందరినీ కలుపుకొని వెళ్లేవారు. ఆస్తుల కంటే ఆప్యాయతలకు, డబ్బు కంటే బంధాలకు విలువిచ్చారు. కులమతాలకు అతీతంగా సోదరభావంతో మెలిగారు. వ్యాపారంలో కల్తీకి, జీవితంలో మోసానికి దూరంగా ఉన్నారు.

### ఆడంబరాలు లేని ఆనందం..

లాంతర్ల వెలుగుల్లోనే జీవితాన్ని వెలిగించుకున్నారు. పోస్ట్‌కార్డుల ద్వారా దూరంగా ఉన్నవారితో అనుబంధాలను కొనసాగించారు. కార్పొరేట్ ఆసుపత్రులు, ఆధునిక సౌకర్యాలు లేకున్నా ఆరోగ్యంగా జీవించారు. ఎంత ఉన్నా ఇంకా కావాలనే దురాశకు దూరంగా.. ఉన్నదానిలోనే ఆనందాన్ని వెతుక్కున్నారు.

### వారితోపాటే విలువలూ మాయమవుతున్నాయా.?

పిల్లల భవిష్యత్తు కోసం తమ జీవితాలను త్యాగం చేసిన ఆ తరం నేడు ఒక్కొక్కరుగా మనకు దూరమవుతోంది. వారి వెంటనే అనుబంధాలు, ఆప్యాయతలు, బాధ్యత, నిజాయితీ, సహనం వంటి విలువలు కూడా కనుమరుగయ్యే ప్రమాదం కనిపిస్తోంది. వెళ్లిపోతున్న ఆ తరాన్ని కేవలం జ్ఞాపకాల్లో ఉంచకుండా.. వారి జీవన విధానంలోని మంచిని నేటి తరం అందిపుచ్చుకోవాలి. లేకపోతే సాంకేతికంగా ముందుకు సాగినా.. విలువల్లో మాత్రం వెనుకబడిన సమాజంగా మిగిలిపోతాం.



# కోదాడలో కొలువుల జాతర.!

- 19న మెగా జాబ్ మేళా.. 250కి పైగా కంపెనీల రాక
- పదో తరగతి నుంచి ఉన్నత విద్య వరకు అందరికీ అవకాశం
- ఒక్కో అభ్యర్థి ఐదు కంపెనీల ఇంటర్వ్యూలకు ఎంపిక
- ఉదయం 8 గంటల నుంచే ఎంపిక ప్రక్రియ

**ప్రజా వాయిస్,కోదాడ:** నిరుద్యోగ యువతకు భారీ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 19న కోదాడలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కోదాడలోని కేకేఆర్‌రెడ్డి పాఠశాలలో జరగనున్న ఈ జాబ్‌మేళాలో 250కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని వెల్లడించారు. ఆదివారం అధికారులతో వెబెక్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు.పదో తరగతి ఉత్తీర్ణుల నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్‌తో పాటు ఇతర ఉన్నత విద్యార్హతలు ఉన్న యువత ఈ జాబ్‌మేళాకు అర్హులని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### ఆన్ లైన్ లో నమోదు

అభ్యర్థులు kodadmegajobmela.com వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం ప్రత్యేక క్యూఆర్ కోడ్‌తో కూడిన అక్నాలెడ్జ్‌మెంట్ వస్తుందని తెలిపారు. ఒక్కో అభ్యర్థి గరిష్టంగా ఐదు కంపెనీల ఇంటర్వ్యూలకు ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

### 5 సెట్ల బయోడేటా తప్పనిసరి

ఈ నెల 19న ఉదయం 8 గంటల నుంచే ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు. అభ్యర్థులు జనరేట్ అయిన అక్నాలెడ్జ్‌మెంట్ ప్రింట్‌తో పాటు ఐదు సెట్ల బయోడేటా ప్రతులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. గ్రామస్థాయిలో టామ్‌టామ్ ద్వారా ప్రచారం చేయడంతో పాటు సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని మండలస్థాయి అధికారులను ఆదేశించారు.

### కళాశాలల ద్వారా విస్తృత ప్రచారం

సూర్యాపేట, ఉమ్మడి నల్గొండ జిల్లాల పరిధిలోని జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలతో సమన్వయం చేసుకుని విద్యార్థులు పెద్ద సంఖ్యలో నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఎస్పీ నరసింహ, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, కంపెనీల సీఈవోలు, ఎండీలు తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

- సర్పంచ్ ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ

**ప్రజావాయిస్/మోమిన్‌పేట్**:తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. గ్రామాల్లో అభివృద్ధి పనులు సజావుగా సాగేందుకు అవసరమైన నిధులు, అధికారాలు కల్పించాలని కోరింది. సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.6,500 నుంచి రూ.25 వేలకు పెంచాలని, గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని సంఘం విజ్ఞప్తి చేసింది. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడంతో పాటు గ్రామపంచాయతీలకు సంబంధించిన కరెంట్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని కోరింది.అలాగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలని, భూముల రిజిస్ట్రేషన్ ఫీజుల్లో 50 శాతం గ్రామపంచాయతీలకు కేటాయించాలని, 73, 74వ రాజ్యాంగ సవరణల ప్రకారం గ్రామపంచాయతీలకు పూర్తి అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు



# ప్రతి ఓటరు ఓటర్ లిస్టులో తప్పనిసరిగా నమోదు కావాలి

- అడిషనల్ కలెక్టర్ హరి సింగ్

**ప్రజా వాయిస్/అడ్డగూడూరు:** అర్హత గల ప్రతి ఓటరు ఓటర్ లిస్టులో తప్పనిసరిగా నమోదు కావాలని సూర్యాపేట జిల్లా రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ బూక్య హరిసింగ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు (సర్) ప్రక్రియను ఆయన పరిశీలించారు. అధికారులు సర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఆర్ఐ ఉపేందర్, జూనియర్ అసిస్టెంట్ శేఖర్, బీఎల్వోలు రాములమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# హైవేపై సంత.. నిబంధనలు ఎక్కడ.?

- చేపల దుకాణాలకు ఆంక్షలు.. సంతకు మాత్రం మినహాయింపా
- నేషనల్ హైవేపైనే ప్రతి ఆదివారం మార్కెట్ .. పొంచి ఉన్న ప్రమాదం
- చిన్న వ్యాపారులకు ఓ న్యాయం.. సంతకు మరో న్యాయమా
- అనుమతులు ఉన్నాయా భద్రతా ప్రమాణాలపై అధికారులే స్పష్టత ఇవ్వాలంటున్న స్థానికులు



**ప్రజా వాయిస్, బూర్గంపాడు:**సామాన్యుల వ్యాపారాలపై నిబంధనలు.. పెద్ద స్థాయిలో నిర్వహించే సంతకు మాత్రం మినహాయింపులా? సారపాక గ్రామపంచాయతీ పరిధిలో నిబంధనల అమలుపై స్థానికులు ఈ ప్రశ్నలు సంధిస్తున్నారు. రహదారి పక్కన చిన్న వ్యాపారులు, ముఖ్యంగా చేపల దుకాణాలు నిర్వహిస్తే ట్రాఫిక్‌కు ఇబ్బందులు, రహదారి ఆక్రమణలు అంటూ అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని వారు చెబుతున్నారు. అదే నేషనల్ హైవేపై ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తుండటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

## హైవేపైనే వ్యాపారాలు..

సంతలో వ్యాపారులు హైవేకు ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేయడం, కొనుగోలుదారులు రోడ్డుపైనే నిలబడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రద్దీ సమయంలో ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అనుమతులు ఉన్నాయా.?

నేషనల్ హైవేపై సంత నిర్వహించేందుకు గ్రామ పంచాయతీ లేదా సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ నిబంధనల ప్రకారం అనుమతులు ఇచ్చారు? సంత నిర్వహణ ప్రాంతం ప్రజలు, వాహనదారుల భద్రతకు అనుకూలంగా ఉందా? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

## ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది.?

ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సారపాక గ్రామపంచాయతీ, రెవెన్యూ, పోలీస్, నేషనల్ హైవే అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి సంత నిర్వహణకు ఉన్న అనుమతులు, భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ పరిస్థితులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని కోరుతున్నారు.

# ప్రారంభానికి నోచుకోని పల్లె ధవఖాన!

- ఏడునూతుల గ్రామ ప్రజలకు వైద్యం అందేది ఎప్పుడు?
- ఆస్పత్రి కట్టారు... వైద్యం మరిచారు!
- భవనం సిద్ధం.. వైద్యం బంద్!
- ప్రజల ప్రాణాలపై ఇంత నిర్లక్ష్యమా?
- ప్రైవేట్ ఆస్పత్రుల ఫీజులు భరించలేక పేదల ప్రజల అవస్థలు!
- గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఆస్పత్రి.. నేటికీ అందుబాటులోకి రాని వైనం!
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి దీనిపై వెంటనే స్పందించాలి
- ఏడు నూతల గ్రామ ప్రజల డిమాండ్.



**ప్రజా వాయిస్/కొడకండ్ల (సెప్టెంబర్ 13)** జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడు నూతుల గ్రామంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం పూర్తయి మూడు సంవత్సరాలు అవుతున్న ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రాకపోవడంపై ఏడు నూతుల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాదిన్నర అవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ఆస్పత్రి నిర్మాణం చేపట్టి సుమారు మూడేళ్లు గడుస్తున్నా ప్రజలకు వైద్య సేవలు అందకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ప్రైవేట్ వైద్యం ప్రజలపై భారం

గ్రామంలో ప్రభుత్వ ఆస్పత్రి అందుబాటులో లేకపోవడంతో అనారోగ్యానికి గురైన ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు అధిక వైద్య ఫీజులు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో సమీప పట్టణాలకు వెళ్లాల్సి రావడంతో ప్రయాణ ఖర్చులు, వైద్య ఖర్చులు మరింత భారమవుతున్నాయి. ప్రజలు ఆందోళన చెందుతున్నారు

## భవనం సిద్ధమైనా.. సేవలు ఎక్కడ?

ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్మించిన ఆస్పత్రి భవనం పూర్తయినా ప్రారంభించకపోవడానికి కారణమేంటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాదిన్నర అవుతున్నా తలుపులు తెరుచుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఆరోపిస్తున్నారు. భవనం నిర్మాణం తోనే ప్రభుత్వ బాధ్యత ముగిసిందా.. ప్రజలకు వైద్యం అందించడం అవసరం లేదా అని నిలదీస్తున్నారు.

## సిబ్బంది, పరికరాల సంగతేంటి?

ఆస్పత్రి ప్రారంభానికి అవసరమైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది నియామకం ఎప్పుడు చేపడతారో అధికారులు స్పష్టం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైన వైద్య పరికరాలు, మందులు, మౌలిక వసతులు ఏర్పాటు చేసి ఆస్పత్రిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. భవనం నిర్మించి ఖాళీగా ఉంచడం వల్ల ప్రజాధనం వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వమే సమాధానం చెప్పాలి

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభానికి ఇంత జాప్యం ఎందుకు జరుగుతోందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణం పూర్తయిన తేదీ, ప్రారంభానికి అడ్డంకులు, సిబ్బంది నియామకం, వైద్య సేవల ప్రారంభ తేదీపై ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్పందించి ఆస్పత్రిని ప్రారంభించి ప్రజలకు ఉచిత, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# కోదాడలో కొత్త రాజకీయ సమీకరణం.!

- రాబోయే అసెంబ్లీ ఎన్నికల బరిలో డా. రామానాయుడు
- ఆరు మండలాల్లో మిత్రమండలి గ్రౌండ్ వర్క్
- నేతలు, విద్యార్థి నాయకులతో మంతనాలు
- పోటీ చేయాలంటూ వివిధ వర్గాల నుంచి ఒత్తిడి
- బరిలో దిగితే మారనున్న రాజకీయ లెక్కలపై ఆసక్తి



**ప్రజా వాయిస్,కోదాడ:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోదాడ నియోజకవర్గ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నేపథ్యం, హైకోర్టు న్యాయవాదిగా అనుభవం ఉన్న డా. యల్. రామానాయుడు వచ్చే ఎన్నికల్లో కోదాడ నుంచి పోటీ చేయనున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే ఆయన మిత్రమండలి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గ్రామస్థాయిలో విస్తృతంగా గ్రౌండ్‌వర్క్ చేస్తున్నట్లు ఆయన వర్గాలు చెబుతున్నాయి.

## విద్యార్థి ఉద్యమం నుంచి న్యాయవాదిగా..

ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే విద్యార్థి, సామాజిక సమస్యలపై ఉద్యమాల్లో పాల్గొన్న రామానాయుడు.. 2009 నుంచి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరగా తెలుసుకునే అవకాశం న్యాయవాద వృత్తి ద్వారా లభించిందని, ప్రజా జీవితంలో వారికి అండగా నిలవాలన్నదే తన లక్ష్యమని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

## 'బరిలోకి రండి' అంటూ నేతల ఒత్తిడి

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కొందరు స్థానిక నాయకులు, ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన పాత, కొత్త విద్యార్థి నాయకులు రామానాయుడిని కోరుతున్నట్లు సమాచారం. ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తిగా ఉన్న కొన్ని వర్గాలు ఆయనకు సహకరిస్తామని చెబుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రజా సమస్యలపై పోరాడే ప్రత్యామ్నాయ నాయకత్వానికి అవకాశం ఉందని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.

## ఆరు మండలాల్లో జోరుగా గ్రౌండ్ వర్క్

కోదాడ, మునగాల, మోతె, నడిగూడెం, చిలుకూరు, అనంతగిరి మండలాల్లోని పలు గ్రామాల్లో రామానాయుడు మిత్రమండలి క్షేత్రస్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు, ప్రజా సమస్యలపై అసంతృప్తిగా ఉన్న వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన వర్గాలు చెబుతున్నాయి. గ్రామస్థాయి నుంచి బలమైన నెట్‌వర్క్ నిర్మించడంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

## బాధిత కుటుంబాలకు అండగా..

రాజకీయ విభేదాలు, హింస కారణంగా కుటుంబ పెద్దలను కోల్పోయిన బాధిత కుటుంబాలను రామానాయుడు పరామర్శించి సహాయం అందించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. బాధితుల పిల్లల చదువుకు సహకరించడంతో పాటు, కేసుల విషయంలో న్యాయపరమైన సహాయం అందించినట్లు పేర్కొంటున్నారు. రాజకీయాలకు అతీతంగా బాధిత కుటుంబాలకు న్యాయం అందాలన్నదే తన ఉద్దేశమని ఆయన వర్గాలు తెలిపాయి.

## ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా

కోదాడ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, మౌలిక వసతులు, యువతకు అవకాశాలు, మహిళలు, బలహీన వర్గాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రామానాయుడు భావిస్తున్నట్లు సమాచారం. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకత్వం, సమస్యలపై వేగంగా స్పందించే వ్యవస్థ, రైతులకు ఆచరణాత్మక పరిష్కారాలు తన ప్రాధాన్యతలుగా ఉండాలని ఆయన భావిస్తున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు.

## మారనున్న కోదాడ రాజకీయ లెక్కలు.?

రామానాయుడు బరిలో నిలిస్తే నియోజకవర్గ రాజకీయ సమీకరణాల్లో ఎలాంటి మార్పులు వస్తాయన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వివిధ పార్టీల అసంతృప్త వర్గాలు, యువత, విద్యార్థులు, ప్రజా సమస్యలపై పోరాడుతున్న వర్గాలను ఒకే వేదికపైకి తీసుకురావాలన్న ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయన్నది చర్చనీయాంశమైంది. ఆరు మండలాల్లో జరుగుతున్న గ్రౌండ్‌వర్క్ ఎన్నికల నాటికి ఎంత బలపడుతుంది రామానాయుడు ఏ పార్టీ తరఫున లేదా స్వతంత్రంగా బరిలో దిగుతారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# ప్రజా వాయిస్ కథనానికి కదిలిన అధికారులు

- పాల్వాయిలో మిషన్ భగీరథ లీకేజీకి మరమ్మతులు

**ప్రజా వాయిస్ : గుర్రంపోడు** మండలంగుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామం వద్ద లింగోటం వెళ్లే ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ సమస్యపై 'ప్రజా వాయిస్'లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి అధికారులు స్పందించారు. రోజుల తరబడి తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో 'ప్రజా వాయిస్' క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి సమస్యను వెలుగులోకి తీసుకొచ్చింది.కథనం ప్రచురితమైన వెంటనే సంబంధిత మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది లీకేజీ ప్రాంతానికి చేరుకున్నారు. పైప్‌లైన్‌ను పరిశీలించి, జేసీబీ సాయంతో గుంతను తవ్వి లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో మరమ్మతు పనులను ప్రారంభించారు. పైప్‌లైన్‌కు ఏర్పడిన రంధ్రాలను పూడ్చి, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం దిశగా చర్యలు చేపట్టేలా చేసిన 'ప్రజా వాయిస్'కు పాల్వాయి, లింగోటం గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు


దాహంతో జనం..
రోడ్డుపై మిషన్ భగీరథ నీళ్లు
- పాల్వాయి వద్ద లింగోటం పైప్ లైన్ కు భారీ లీకేజీ
- రోజులుగా వృథాగా పోతున్న తాగునీరు
- అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- వెంటనే లీకేజీని అరికట్టాలని ప్రజల డిమాండ్



# కాల్చడానికి తుపాకీ ఎందుకు....?

- చంపాలనుకుంటే రెండు రూపాయల బ్లేడ్ చాలు
- వివాదా స్పద వ్యాఖ్యలు చేసిన పోలీస్ కృష్ణ
- ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి పంచన చేరడం ఆయన నైజ్యం

**ప్రజా వాయిస్, సంగారెడ్డి :** మనిషిని చంపాలనుకుంటే కేవలం తుపాకే అవసరం లేదు... దానికి కేవలం రెండు రూపాయల బ్లేడ్ చాలు అంటూ పోలీస్ శాఖలో విధులు నిర్వహించి తన పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లో తిరుగుతున్న ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో నక్సలైట్లను చంపాలనుకుంటే ఆయుధాలే కావాలనుకునే పోలీసులకు ఆయుధాల కంటే పదునైనది బ్లేడ్ అనేది పోలీస్ కృష్ణ చెప్పిన అర్థం అనేది స్పష్టం. నల్లమల అడవుల్లో ఎంతమంది నక్సలైట్లను హతమార్చారు అని యాంకర్ ప్రశ్నిస్తే చంపింది వాస్తవమే కానీ దానికి ఆయుధాలు అక్కర్లేదు బ్లేడ్ ఉంటే చాలు అని వ్యక్తిని సునాయాసంగా చంపొచ్చు అని ఆయన ఇంటర్వ్యూలో ఇచ్చారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో పోలీస్ శాఖలో గతం లో విధులు నిర్వహించిన పోలీస్ కృష్ణ ( మెదక్ జిల్లా రేగోడు మండలం) తెలంగాణ ఏర్పడ్డాక పోలీస్ శాఖ ఉద్యోగానికి రాజీనామా చేసి టిఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. 2019 ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించిన ఫలితం దక్కలేదు. దీంతో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ కు అతి సన్నిహితంగా ఉన్నందున సంగారెడ్డి జిల్లా అందోల్ అసెంబ్లీ ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి స్థానిక అభ్యర్థి అయిన తనకు అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. తనకున్న రాజకీయ నాయకులతో పైరవీలు సైతం చేశారు. అయిన టికెట్ దక్కకపోవడంతో 2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ రెండు పార్టీలలో ఆయనకు పార్టీ పరమైన పదవులు ఏమీ లేకపోయినా తమకున్న పోలీస్ శాఖ సంబంధాలతో వివిధ స్థాయిలో మంత్రులను రాష్ట్రస్థాయి అధికారులను కలిసి మీడియాలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే ఒక ప్రైవేట్ యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివాహస్పదమైన వ్యాఖ్యలు చేశారు. నల్లమల అడవుల్లో మీరు పని చేసినప్పుడు ఎంతమందిని చంపారు.... మీరు వచ్చే ముందు ఆయుధాలు తీసుకొచ్చారా అని యాంకర్ ప్రశ్నిస్తే అక్కడ ఉన్నప్పుడు చంపింది వాస్తవమే కానీ తాను వచ్చే ముందు ఏమి తీసుక రాలేను అంటూనే మనిషిని చంపాలనుకుంటే గన్నులే అవసరం లేదు... కేవలం రెండు రూపాయల బ్లేడ్ చాలు అంటూ వ్యాఖ్యానించడం పోలీస్ శాఖలో తీవ్ర చర్చ జరుగుతుంది.

యూనిఫామ్ డిపార్ట్మెంట్లో పని చేస్తూ డిస్ప్లిన్ డిపార్ట్మెంట్ గా ఉన్న పోలీస్ శాఖ నుంచి బయటికి వచ్చి ప్రత్యేకంగా నక్సలైట్లను ఉద్దేశించి వారిని చంపాలంటే గన్నే అక్కర్లేదు కేవలం రెండు రూపాయల బ్లేడ్ చాలు అని వ్యాఖ్యానించడం పట్ల అటు పోలీసులు ఇటు విప్లవ అనుబంధ సంఘాల నాయకులు పోలీస్ కృష్ణ చేసిన వ్యాకలపై తీవ్ర విమర్శలు రేపుతున్నాయి. అంటే తన శత్రువులను చంపాలనుకుంటే కత్తులు కటరాళ్లు కాదు ఒక బ్లేడ్ ఉంటే చాలు అనేది ఆయన మాటలో ఉన్న అర్థం. ఆయన మాటలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉన్నాయని పోలీసు వర్గాల్లో ఉన్నా ఒక సీనియర్ అధికారి అభివర్ణించారు. మనిషిని చంపాలనుకుంటే ఆయుధాలు అక్కర్లేదు బ్లేడ్ ఉంటే చాలు అనేది ఆయన ఉద్దేశం. ఇది సమాజానికి ఏ పార్టీ సందేశం ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు.



## అప్పుడు కేటీఆర్....ఇప్పుడు దామోదర్

తన పదవికి రాజీనామా చేయడంతో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ కృష్ణ తనదైన శైలిలో రాజకీయంగా పావులు కదుపుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి కేటీఆర్ కు అతి సన్నితంగా ఉంటున్నట్లుగా చెప్పుకుంటూ ప్రతిరోజు ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద దర్శనమిచ్చేది. పైరవీ కార్లు నియోజకవర్గ స్థాయి నాయకులు కేటీఆర్ తో ఏమైనా పనులు ఉంటే పోలీస్ కృష్ణని పట్టుకుంటే అయిపోతుందని భావించారు. అలా చెప్పుకునే కాలం వెళ్లే తీశారు. తాజాగా ప్రభుత్వం మారింది...పాలకులు మారారు. ఈ సమయంలో ఏం చేయాలో తెలియక మంత్రి దామోదర్ రాజనర్సింహ పంచన చేరి ఆయన గుమ్మం వద్ద నిత్యం దర్శనమిస్తున్నారు. ఇప్పుడు కూడా పోలీస్ కృష్ణ చెప్తే మంత్రి దామోదర్ విని తమ పని చేస్తారని భావించే నాయకులు.. కింది స్థాయి క్యాడర్ పోలీస్ కృష్ణ ను మాత్రమే ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని ప్రతి ఫైల్ కు ఎంత కొంత డబ్బులు తీసుకోవడంతో పాటు సి ఎం ఆర్ ఎఫ్ ఫైళ్ల కోసం ముడుపులు కూడా తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఒక యూట్యూబ్ ఛానల్ కు వివాదాస్పరమైన వ్యాఖ్యలు చేస్తు ఇంటర్వ్యూలు ఇవ్వడం పట్ల ఇటు రాజకీయాల్లో... అటు పోలీస్ శాఖలో తీవ్ర చర్చ జరుగుతుంది. చివరకు ఏం జరుగుతుందో వేచి చూడాలి.

# ప్రకృతి హితమే పండగల పరమార్ధం,, మట్టి గణపతుల పంపిణీపలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

**సొంత నిధులతో దేవాలయ షెడ్డు నిర్మాణం**
**మండే మార్కెట్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన**
**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్ చెరువు ప్రజావాయిస్ నిరంతరం ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో భాగంగా సంత నిధులతో నూతన దేవాలయాలు నిర్మిస్తూ తన భక్తి భావాన్ని చాటు కుంటున్న ఎమ్మెల్యే గోడ మహిపాల్ రెడ్డి డివిజన్ పరిధిలోని మండే మార్కెట్ శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం ఆవరణలో ఆరు లక్షల రూపాయల సంతల నిధులతో నిర్మించిన షెడ్డును శనివారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు భక్తులు ఆలయానికి వచ్చే ప్రజలకు ఉపయోగపడే గుండెల చెట్టును నిర్మించినట్లు పేర్కొన్నారు అలాగే దేవాలయం అభివృద్ధిలో భాగంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు ఆలయ అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టి మరింత సుందరంగా చేసి కృషి చేస్తానని తెలిపారు గతంలోనూ చాలా హారం నిర్మాణానికి రెండు లక్షల రూపాయల నిధులు అందించినట్లు గుర్తు చేశారు ప్రకృతికి తన పండగల పరమార్థమని పర్యావరణ పరిరక్షణ భాగంగా ప్రతి ఒక్కరు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని అన్నారు పటాన్చెరువు పట్టణంలోని గాంధీజీ పార్క్ సర్కిల్లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పండగ వెనుక ఒక మహోన్నత లక్ష్యం దాగి ఉంటుందని అన్నారు ప్రకృతితో మమేకమతం నేల నీరు చెట్టు పుట్ట తదితర ప్రకృతి శక్తులను ఆరాధించడం భారతీయ సాంస్కృతిలో భాగంగా తెలిపారు పర్యావరణం పరిరక్షణ దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని సూచించారు ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు ఇందులో భాగంగానే ఏడాది సుమారు 600 మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా సహకరించాలని వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో పాటు ప్రకృతి పరిరక్షణ జరుపుకోవాలని ఎమ్మెల్యే కోరారు అలాగే పటాన్చెరువు జేపీ కాలనీలో పరిధిలోని వివిధ కాలనీలలో మూడు కోట్ల 78 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టను ఏది అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు అనంతరం స్టంట్ ఫీల్డ్ దేవ్ ప్రయాణం విలాస్ కాలనీలలో రక్షిత మంచినీటి సరఫరాను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి మాజీ కార్పొరేటర్ సఫన్ దేవ్ శంకర్ యాదవ్ మెట్టు కుమార్ యాదవ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్ ఈఈ కృష్ణవేణి టిఆర్ఎస్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి నర్ర బిక్షపతి పృథ్వీరాజ్ అమీన్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అమీన్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి మాజీ ప్రజా ప్రతినిధులు లు బాలరాజు గోపాల్ ప్రమోద్ రెడ్డి కృష్ణ ఇతర తాజా మాజీ ప్రజా ప్రతినిధులు కాలనీలవాసులు టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# అనసూర్యకు మంత్రి శ్రీధర్‌బాబు అండ

**చికిత్స కోసం రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు**
**నిమ్స్‌లో చికిత్స పొందుతున్న సర్వాయిపేట వాసికి ఆర్థిక భరోసా**
**కుటుంబ సభ్యుల విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన మంత్రి**

ప్రజా వాయిస్, పలిమెల:
అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలిమెల మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన దుర్గం అనసూర్య కుటుంబానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అండగా నిలిచారు. వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కుటుంబ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ. 2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ఆస్పత్రి సహాయకులు అనసూర్య కుటుంబ సభ్యులకు ఎల్ఓసీని అందజేశారు. మంథని నియోజకవర్గ ప్రజల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపుతున్న మంత్రి.. అనసూర్య వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సాయాన్ని సమకూర్చడంతో కుటుంబానికి ఊరట లభించింది. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచి చికిత్స కొనసాగేందుకు భరోసా కల్పించిన మంత్రి శ్రీధర్‌బాబుకు అనసూర్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# అడవులు, వన్య ప్రాణాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ఫారెస్ట్ రేంజర్ అధికారి జి.ప్రసాదరావు.**

ప్రజా వాయిస్ గూడూరు
మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అడవులు, వన్యప్రాణాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు ప్రసాదరావు, జిల్లా అధికారులు శ్రీమన్నారాయణ రెడ్డి, రాజేంద్రప్రసాద్, లతో కలిసి కొత్తగూడ మండలం శ్రీ గుంజేడు ముసలమ్మ తల్లి, దేవాలయ ప్రాంగణం, భీముని పాదం, అటవీ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ..

**అడవులు, వన్యప్రాణుల సంరక్షణ – మనందరి బాధ్యత**
మానవ మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు అడవులు, వన్యప్రాణులు అత్యంత కీలకమైనవి. అడవులు మనకు స్వచ్ఛమైన గాలి, నీరు, వర్షాలు మరియు ప్రాణవాయువును అందిస్తే, వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే పెరుగుతున్న పట్టణీకరణ, అటవీ నిర్మూలన, మరియు మానవ కార్యకలాపాల వల్ల అనేక రకాల జీవరాశులు అంతరించిపోయే ప్రమాదంలో పడ్డాయి. అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అటవీ మరియు పర్యావరణ శాఖ పిలుపునిస్తోంది.

**ప్రధానాంశాలు,సూచనలు:**
అటవీ విస్తీర్ణాన్ని పెంచడం: మన ఇంటి పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలి. అడవులను నరకడం, చెట్లను నరికివేయడం చట్టరీత్యా నేరం.
వన్యప్రాణుల రక్షణ: వన్యప్రాణులను వేటాడటం, వాటి సహజ ఆవాసాలను నాశనం చేయడం తీవ్రమైన నేరం. వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకూడదు.
ప్లాస్టిక్ వాడకం నివారణ: అటవీ ప్రాంతాల్లోకి విహారయాత్రలకు వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వల్ల అడవి జంతువులు ప్రమాదంలో పడుతున్నాయి. కాబట్టి అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలి.
అటవీ అగ్నిప్రమాదాల అరికట్టడం: అడవుల్లో నిర్లక్ష్యంగా నిప్పు పెట్టడం వల్ల వేలాది ఎకరాల అడవితో పాటు అరుదైన జీవరాశులు బూడిదవుతున్నాయి. ప్రజలు ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి.
**ప్రజలకు విజ్ఞప్తి:**



వన్యప్రాణులు గాయపడినా లేదా గ్రామాలు/పట్టణాల్లోకి వచ్చినా ప్రజలు స్వయంగా వాటిపై దాడి చేయకుండా, వెంటనే సమీపంలోని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలిని పిలుపునిచ్చారు..ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, జిల్లా ఫారెస్ట్ అధికారి లావణ్య, ల సూచనల ప్రకారం జిల్లాలో అడవి, వన్యప్రాణాల సంరక్షణ హరిత హారం, వనమహోత్సవం కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా టెంపుల్ టూరిజం అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందని అన్నారు.




# మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

**- 18 ఏళ్లుగా ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ**

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :
పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా గత 18 సంవత్సరాలుగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని సామాజిక కార్యకర్త, యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తుమ్మ రాజ్‌కుమార్ తెలిపారు. గణేశ్ నవరాత్రుల్లో ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని ఆయన పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో తుమ్మ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు నీటి కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. యువ సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 18 ఏళ్లుగా నిరంతరంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణేశ్ నవరాత్రులను ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని రాజ్‌కుమార్ కోరారు. ఎలాంటి అల్లర్లు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. పర్యావరణహితమైన మట్టి గణపతులనే ప్రతిష్ఠించేలా ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యువ సంకల్ప ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి తుమ్మని శాంత్, ముఖ్య సభ్యులు విశ్వనాథ్, గాలిపెల్లి కుమార్, చాతల శివ, నిఖిలేష్, శ్రీమణి, ఉద్భవ్, నీరజ్‌కుమార్, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విమోచన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

**కర్ణాటక, మహారాష్ట్ర లో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించడం అభినందనీయం..**
**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించకపోవడం శోచనీయం..**
**మాజీ ఎంపీ బీబీ పాటిల్ డిమాండ్..**

ప్రజా వాయిస్ జహీరాబాద్: తెలంగాణ విమోచన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆదివారం నాడు అతిథి హోటల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం బీబీ పాటిల్ మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ తెలంగాణలో మాత్రం ఇప్పటివరకు అధికారికంగా నిర్వహించకపోవడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు భయపడి ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా తెలంగాణ విముక్తికి కీలక పాత్రపోషించిన అప్పటిఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్నిహైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. అంతేకాకుండా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు, విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలు, భారతీయ సంస్కృతిపై అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. మరియు జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ విషయంలో రైల్వే శాఖ మంత్రిని కలిసి చర్చించామని, ఆయన సానుకూలంగా స్పందించారని బీబీ పాటిల్ తెలిపారు. అదేవిధంగా బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్ ప్రాంతానికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుభాష్‌రెడ్డి, అరుణా కౌలాస్, పాండురంగారెడ్డి, పూల సంతోష్, మల్లేష్, ఎంజీ దుర్గయ్య, అప్పం శ్రవణ్, అరుణ్, శ్రీకాంత్, సోమ అనిల్, నరేష్ పాటిల్, మంజుల కౌలాస్, సురేష్ పూరి, శివరాజ్, నాగరాజు, నితీష్ జైన్ తదితరులు పాల్గొన్నారు..



# నాగర్ కర్నూల్ జిల్లా పోలీసు, సీసీఎస్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ప్రత్యేక బృందం పనితీరుపై డీజీపీ ప్రశంసలు.

ప్రజా వాయిస్ సెప్టెంబర్ 13 సికింద్రాబాద్ బొల్లారం మద్రాస్ ఆర్మీ రెజిమెంట్ నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రి అపహరణ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది ఆయుధాల అపహరణ కేసులో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతానికి చెందిన ఆర్మీ జవాన్ రాజు అలియాస్ మల్లేష్ పాత్ర ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించినట్లు మల్లేష్ స్వస్థలం నాగర్ కర్నూల్ జిల్లా పదర మండలం ఉడిమిల్ల గ్రామమని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ వెల్లడించారు ఇళ్లలో దాచిన ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు నాగర్ కర్నూల్ జిల్లా పోలీసులు, బొల్లారం పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారుఆర్మీ జవాన్ రాజు అలియాస్ మల్లేష్‌ను బొల్లారం పోలీసులు అరెస్ట్ చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. మల్లేష్‌ను పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన నాగర్ కర్నూల్ జిల్లా పోలీసులకు ప్రశంసలు హైదరాబాద్‌లో నిన్న జరిగిన పత్రికా సమావేశంలో తెలంగాణ డీజీపీ శ్రీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను అభినందించారు.



**నాగర్ కర్నూల్ జిల్లా పోలీసు, సీసీఎస్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ప్రత్యేక బృందం పనితీరుపై డీజీపీ ప్రశంసలు.**
ఇన్‌స్పెక్టర్ శ్రీ శంకర్, ఏఎస్ఐ జానకి రాములు, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటయ్య, గోపాల్, వెంకట్ రాములు, లింగం గౌడ్ తదితరులను డీజీపీ అభినందించారు. ఆయుధాల అపహరణ కేసు దర్యాప్తు కొనసాగుతోందని నాగర్ కర్నూల్ జిల్లా పోలీసుల వెల్లడి.

# తిరుమల బ్రహ్మోత్సవాలు

## ఆరు రోజుల పాటు ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ నిలిపివేత

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతిలో జారీ చేసే సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లను సోమవారం నుంచి ఆరు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 19వ తేదీ వరకు భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుని క్యూలైన్లలో చేరాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తిరిగి ఈనెల 20న.. 21వ తేదీ దర్శనం కోసం టోకెన్లను జారీ చేయనుంది. అయితే, సోమవారం నాటి టోకెన్ల కోసం ఆదివారం ఉదయం నుంచే తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్‌ల వద్ద భక్తులు బారులు తీరారు. టోకెన్ల నిలిపివేతపై తమకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఆవేదన, నిరాశ వ్యక్తం చేశారు. అనంతరం వారంతా తిరుమలకు ప్రయాణమయ్యారు. వరుస సెలవులు కూడా తోడవడంతో తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి
సెప్టెంబర్ 14న అంకురార్పణతో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా, 15న ధ్వజారోహణంతో మొదలై 23వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. అధికమాసం కారణంగా ఈ ఏడాది సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలను రెండుసార్లు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 15న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఆదివారం నాటి సమాచారం ప్రకారం, సర్వదర్శనానికి సుమారు 24 గంటల సమయం పడుతుండగా, 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. శనివారం ఒక్కరోజే 81,724 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, హుండీ ఆదాయం రూ.4.04 కోట్లుగా నమోదైంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం వీఐపీ బ్రేక్ దర్శనాలు (ప్రొటోకాల్ మినహా), వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక దర్శనాలతో పాటు పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.





## అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆర్థిక సాయం

**పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించిన లయన్స్ క్లబ్ అధ్యక్షులు పసునూరి మధుసూదన్**

ప్రజా వాయిస్/కొడకండ్ల (సెప్టెంబర్ 13)
కొడకండ్ల మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబాన్ని ఆదుకునేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ కొడకండ్ల ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం క్లబ్ అధ్యక్షుడు పసునూరి మధుసూదన్ అధ్యక్షతన కొడకండ్ల మండల కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో మృతిచెందిన మహమ్మద్ జావిద్ (34) కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. అనంతరం క్లబ్ తరపున రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా నిలిచి, వారి కష్టాల్లో భాగస్వాములవుతున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు.కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ, కోశాధికారి, ఉపాధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## పట్లూర్ లో ఘనంగా బాల వినాయకుడి ఆగమన వేడుకలు

**భక్తి, ఆధ్యాత్మికతతో పాటు అలరించిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శన**

ప్రజావాయిస్/వికారాబాద్:
బాల వినాయకుడి 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మర్పల్లి మండలం పట్లూర్ లో బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో కొత్త ట్రేడ్ సిటీ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆగమన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు సందడిగా సాగాయి.సంప్రదాయ వేషధారణలో వేదికపైకి వచ్చిన చిన్నారులు లయబద్ధమైన అడుగులు, అద్భుతమైన హావభావాలు, అభినయం, చక్కటి నృత్య భంగిమలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సంగీతానికి అనుగుణంగా చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం చూపరులను మంత్రముగ్ధులను చేసింది.ప్రదర్శన సాగుతున్నంతసేపు వేదిక పరిసరాలు కరతాళధ్వనులతో మార్మోగాయి. చిన్నారుల ప్రతిభను చూసిన గ్రామస్థులు, భక్తులు వారిని ప్రోత్సహిస్తూ అభినందనలు తెలిపారు. ఇంత చిన్న వయసులోనే శాస్త్రీయ నృత్యంలో అద్భుతమైన ప్రతిభ కనబరచడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.సంప్రదాయ కళలకు ప్రాధాన్యతనిస్తూ భరతనాట్య ప్రదర్శనను ఏర్పాటు చేసిన బాల వినాయక యూత్‌ను గ్రామస్థులు అభినందించారు. భక్తి, కళ, యువత ఉత్సాహం కలగలిసిన ఆగమన వేడుకలు కన్నుల పండువగా సాగాయి.ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.చిన్నారుల ప్రతి నృత్య భంగిమకు ప్రేక్షకులు కరతాళధ్వనులు, హర్షధ్వానాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేతిపంపునకు మరమ్మతులు.. తీరిన తాగునీటి కష్టాలు.!

**కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న పంపు పునరుద్ధరణ**
**పంచాయతీ సిబ్బంది చర్యలతో అందుబాటులోకి నీటి వసతి**
**సర్పంచ్ చొరవపై గ్రామస్థుల హర్షం**
**నీటి వనరులపై నిరంతర పర్యవేక్షణకు విజ్ఞప్తి**

ప్రజా వాయిస్,చిలుకూరు:
సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దూతియా తండాలో కొంతకాలంగా మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్న చేతిపంపునకు ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది చేపట్టిన చర్యలతో పంపు తిరిగి పనిచేయడంతో స్థానికులకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.చేతిపంపు పనిచేయకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులకు ఈ చర్య ఊరటనిచ్చింది. సమస్యను గుర్తించిన సర్పంచ్ లావూరి రమాదేవి శ్రీనివాస్ చొరవతో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. పంపు అందుబాటులోకి రావడంతో గ్రామస్థులు సర్పంచ్, పంచాయతీ సిబ్బందికి అభినందనలు తెలిపారు.గ్రామంలోని తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొర్ర సురేష్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



# అక్రమ సంబంధానికి భర్త బలి

**జిల్లాలో సంచలనం సృష్టించిన ఛేదించిన పోలీసులు**
**మరిది తో అక్రమ సంబంధం ఆపై హత్య అని తేల్చిన పోలీసులు**

ప్రజా వాయిస్ సెప్టెంబర్ 13
నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ముస్లిం యువకుడు హత్యని చేదించిన నాగర్కర్నూల్ జిల్లా పోలీసులు వివరాల్లోకి వెళితే 10.09.2026 నాడు ఫిర్యాదుదారుడు వీఎ. హుస్సేన్ తండ్రి ఇబ్రాహీం, వయసు: 36 సంవత్సరాలు, కులం: ముస్లిమ్ వృత్తి: వ్యాపారం గగ్గలపల్లి గ్రామము అను వ్యక్తి తన అన్న మహమ్మద్ కరీం, వయసు 43 సంవత్సరాలు అను వ్యక్తిని తన ఇంటిలోనే హాల్ లో చంపినారాని తేదీ 10.09.2026 రోజు మద్యాహ్నం అందదా రెండు గంటల సమయంలో కొల్లాపూర్ లో ఉండగా సమాచారం రాగా వచ్చి చూసి ఘటనా స్థలం లోనే పిర్యాదు ఇవ్వగా అట్టి పిర్యాదు పై విచారణ చేయగా మృతుని భార్య సలీమా బేగం మరియు ఆమెకు వరుసకు మరిది అయిన గౌస్ పాషా నాగపూర్ ఇద్దరి మద్య గత రెండు సంవత్సరాలుగా అక్రమ సంబందం ఉన్న విషయం, మరియు అతనితో బైక్ పై తిరగడం చూసిన మృతుడు తన భార్యను మందలించగా అప్పటినుండి భార్యా భర్తల మద్య తరుచుగా గొడవలు జరుగగా కుటుంబ సభ్యులు, పెద్ద మనుషులు ఎన్ని సార్లు సర్ది చెప్పినా మారకుండా అలాగే ప్రవర్తిస్తూ ఉండగా గత రెండు నెలల క్రితం పెద్దమనుషులు పంచాయితీ పెట్టి గౌస్ ను తిట్టడంతో గౌస్ కోపంతో నేను నిన్ను ఎప్పటికైనా చంపేస్తా అని అక్కడినుండి వెళ్తూ అదే రోజు రోడ్డు పక్కన అమ్మేవారి నుండి ఒక కత్తిని కొనుక్కొని వెళ్ళి ఇంటిలో దాచిపెట్టుకున్నాడు. తర్వాత ఇద్దరు తరుచుగా ఎవరికి తెలియకూడదు అని వాట్సప్ కాల్ ద్వారా మాట్లాడుకునే వాళ్ళు అప్పటినుండి ఎలాగైనా కరీంను చంపాలని ఎదరు చూస్తుండగా తేదీ 07.09.2026 రోజున సలీమా బేగం నెల్లూర్ దర్గా దగ్గరకు వెళ్తూ అట్టి విషయం వాట్సప్ కాల్ ద్వారా గౌస్ ?కు తెలియజేయగా ఎవరికి అనుమానం రాకుండా ఉండడానికి ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం ఎలాగూ ఆస్తి సలీమా పేరున ఉన్నందున భర్తను అడ్డు తొలగించుకుంటే ఆస్తి అనుభవించ వచ్చు మరియు గౌస్ తో అక్రమ సంబందం కొనసాగించవచ్చు అని అనుకొని ఇద్దరు కలిసి ప్లాన్ ప్రకారం సలీమా నెల్లూర్ దర్గాకు వెళ్ళిన తర్వాత ఇంట్లో ఎవ్వరూ ఉండరు కావునా సమయం చూసుకొని కరీంను చంపాలని నిర్ణయించుకొని తేదీ 09.07.2026 రోజు రాత్రి అందాజ 7.30 గంటలకు ఈ రోజు రాత్రికి కరీంను చంపుతానని సలీమా కు వాట్సప్ కాల్ ద్వారా గౌస్ తెలియజేసి రాత్రి అందదా 2.30 గంటలకు ముందే తెచ్చిపెట్టుకున్న కత్తి, గ్లాసులు, ఒక జత బట్టలు తీసుకొని నాగర్ కర్నూల్ కు వచ్చి కరీం ఇంటికి వెళ్ళి డోర్ బెల్ కొట్టగా నిద్ర మత్తులో డోర్ తీయగానే కత్తితో కరీంపై దాడి చేసి గొంతు కోసి చంపి అక్కడినుండి పారిపోయినాడు. తన ఊరికి వెళ్తూ మద్యలోనే చెట్ల పొదలలో కత్తి, చెప్పులు, బట్టలు,గ్లాసులు పడేసి వెల్లిపోయినాడు. ఈ రోజు అనుమానంతో సలీమా ను అదుపులోకి తీసుకొని విచారించగా జరిగిన విషయం చెప్పగా, ఆమె వాంగ్మూలం మేరకు గౌస్ పాషా ను అదుపులోకి తీసుకొని విచారించగా కరీం ను తానే చంపినాను అని జరిగిన విషయం చెప్పి చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు.అందువల్ల ఈ రోజు పై తెలిపిన నెరస్థులను అరెస్ట్ చేసి రేమండ్ కి తరలించనైనది. ఇట్టి కేసును డెటెక్ట్ చేసిన సి.ఐ మరియు ఎసై మరియు ఐ.డి పార్టీ సిబ్బంది వెంకటేష్, భీముడు, రమేష్ లను డీ.ఎస్పీ నాగర్కర్నూల్ అభినందించినారు.



# ప్రతిభా పురస్కార గ్రహీతకు ఘనంగా సన్మానం

**ప్రతిభ పురస్కారం పొందిన నక్క విష్ణు లఘు డాక్యుమెంటరీ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయం**
**కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్**

ప్రజా వాయిస్.. వీపనగండ్ల
కొత్త తెలంగాణ చరిత్రబృందం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బొమ్మలపల్లకి వీడియోగ్రఫి పోటీలలో ద్వితీయ బహుమతితో"ప్రతిభా పురస్కారం" పొందిన నక్క విష్ణును సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఆదివారం స్థానిక రేడియంట్ హై స్కూల్ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం అయిన శ్రీరంగాపురంపై నక్క విష్ణు (సంగీనేనిపల్లి ) రూపొందించిన లఘు డాక్యుమెంటరీ ఈ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు.ఇందుకుగాను ఆయనకు ప్రతిభా పురస్కార ప్రశంసాపత్రంతో పాటు,శాలువ,ఆరువేల నగదు పైకాన్ని అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో అత్యంత ప్రాచీనమైన కట్టడాలు,ప్రదేశాలు ఉన్నాయని వాటిని వెలుగులోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉందని శంకర్ గౌడ్ పిలుపు నిచ్చారు.అవార్డులు ఒక వ్యక్తిలో గల ప్రతిభకు మరింత ప్రోత్సాహాన్నిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్,కొత్త తెలంగాణ చరిత్రబృందం జిల్లా కన్వీనర్ డా.బైరోజు శ్యాంసుందర్,వ్యాఖ్యాత బైరోజు చంద్ర శేఖర్,డా.కంటే నిరంజనయ్య, బండారు శ్రీనివాస్,డా.తూర్పింటి నరేశ్ కుమార్,పెరుమాళ్ళ శ్రీనివాస్,దేశి రాములు యాదవ్ దినేశ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థిని,విద్యార్థులు భాద్రపదశుద్ధ వినాయక చవితి పర్వదినం

ప్రజా వాయిస్ కొత్త గూడ
సందర్భంగా విధాత ఫౌండేషన్ వారి సహకారంతో ఎకో ఫ్రెండ్లీ వినాయకులను మట్టితో తయారు చేయడం జరిగింది. దాదాపుగా ఈ కార్యక్రమంలో 40 మంది విద్యార్థులు పాల్గొని అతి సుందరమైన గణపతులను ఎంతో సృజనాత్మకంగా తయారు చేయడం జరిగింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్తో తయారుచేసిన వినాయకుల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, చెరువులోని జీవరాసులు అంతమవుతాయని, నీటి కాలుష్యం జరుగుతుందని, మట్టి వినాయకులు నీటిలో నిమజ్జనం వల్ల తేలికగా కరిగిపోయి ఎలాంటి నష్టం జరగదని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించి మట్టి వినాయకులనే గణపతి నవరాత్రి ఉత్సవాలలో వాడాలనే సందేశం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా విధాత ఫౌండేషన్ నిర్వాహకులు పిల్లలకు పార్టిసిపేషన్ బహుమతితో పాటు వినాయకులను చక్కగా తయారుచేసిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు గాను సర్టిఫికెట్స్ తో పాటు మరియు జ్ఞాపికలను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమాన్ని సందర్శించిన కొత్తగూడ మండల ఎంపీడీవో ఎంఈఓ గుమ్మడి లక్ష్మీనారాయణ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సరియ, స్థానిక స్కూల్ హెచ్ఎం గుమ్మడి లలిత, విద్యార్థుల ప్రతిభను మెచ్చుకొని అభినందించారు ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన స్థానిక ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెవుల సరస్వతి, నామాల మోహన్, తీగల రమేష్, చాట్ల బేబీ, కల్తీ రాధిక, ఆలూరి శంకరయ్య, కాశబోయిన భరత్ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





# మహిళల ఆసియా కప్ భారత్ కైవసం




**శ్రీలంకపై 72 పరుగుల ఘన విజయం**
**రికార్డు స్థాయిలో ఎనిమిదో ఆసియా కప్ టైటిల్ సాధించిన భారత జట్టు**

సెప్టెంబర్ 13 :
మహిళల టీ20 ఆసియా కప్ 2026 టైటిల్‌ను భారత జట్టు కైవసం చేసుకుంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ శ్రీలంకను భారత్ 72 పరుగుల తేడాతో ఓడించింది.టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. టోర్నీలో భారత్ నమోదు చేసిన అత్యధిక స్కోరుగా ఇది నిలిచింది.అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంకను భారత బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. శ్రీలంక జట్టు 111 పరుగులకే ఆలౌట్ కావడంతో భారత్ భారీ విజయాన్ని అందుకుంది.ఈ విజయంతో మహిళల ఆసియా కప్‌లో భారత్ మొత్తం ఎనిమిదో టైటిల్‌ను సాధించింది. 2024లో శ్రీలంక చేతిలో ఎదురైన ఫైనల్ పరాజయానికి భారత్ ఈసారి ఘన విజయంతో బదులిచ్చింది.భారత మహిళల జట్టు సాధించిన ఈ విజయం రాబోయే అంతర్జాతీయ పోటీలకు మరింత ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి.



## మణికొండలో పేలుడు ఉలిక్కిపడ్డ జనం

**దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు**
**అప్రమత్తమైన ఫైర్ సిబ్బందితో తప్పిన పెను ప్రమాదం**

ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:
మణికొండలో గ్యాస్ సిలిండర్ పేలుడు సంభవించడంతో అక్కడి ప్రజలు ఉలిక్కిపడ్డారు. బీఆర్‌సీ భవనం సమీపంలోని ఓ వాణిజ్య దుకాణంలో ఆదివారం రాత్రి సిలిండర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ వట్టినాగులపల్లి,పంజాగుట్ట నుంచి రెండు అగ్నిమాపక వాహనాలను రంగంలోకి దించింది.సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకముందే నియంత్రించడంతో పెను ప్రమాదం తప్పింది.పేలుడు సమయంలో దుకాణంలో ఎవరైనా ఉన్నారా.? సిలిండర్ పేలడానికి కారణాలేమిటన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.ఆస్తి నష్టం భారీగానే జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

# మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠిద్దాం..
# పర్యావరణాన్ని కాపాడుకుందాం

**నాగారం డివిజన్ రాంపల్లిలో మట్టి వినాయకుడి పంపిణీ చేసిన మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి**

**ప్రజావాయిస్, నాగారం డివిజన్ :**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్ నియోజకవర్గం నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లిలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి హాజరై భక్తులకు మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. నాగారం మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు."మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున, పర్యావరణహితమైన మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రజలు ప్రోత్సహించాలని కోరారు. వినాయక చవితిని పర్యావరణహితంగా



నిర్వహించడం ద్వారా ప్రకృతిని కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు పర్యావరణ పరిరక్షణపై మంచి సందేశాన్ని అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతి ప్రతిమలను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, డివిజన్ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...



# విద్యార్థులభవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులపాత్ర ఎంతో కీలకం

**నవ సమాజ నిర్మాతలు గురువులు**
**ఉత్తమఉపాధ్యాయులకుసన్మానం**

ప్రజా వాయిస్ కొత్తగూడ
కొత్తగూడ మండల కేంద్రంలోని ఎంపీ యూ పి ఎస్ కొత్తగూడ పాఠశాలలో గురుపూజా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 5న నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని 21 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేసి వారి సేవలను అభినందించారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ బడులను కాపాడుకుంటూ.. పిల్లల నమోదును పెంచడం లోనూ ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఎం ఈ వో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, ఎంపీవో రామకృష్ణ, ఎంఈఓ గుమ్మడి లక్ష్మి నారాయణ, గంగారం ఎంఈఓ విష్ణువర్ధన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమాదేవి, సర్య తదితరులు పాల్గొన్నారు. పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ బాధ్యులు నెల్లుట్ల భాస్కర్,విద్యాశాఖ సిబ్బందితదితరులు పాల్గొన్నారు




# కారు కొనుగోలు పేరుతో దోపిడీ

**ఫార్మ్‌హౌస్‌కు రప్పించి పిస్టల్, కత్తులతో బెదిరింపు**
**బెంజ్ కారు, నగదు, ఐఫోన్, వాచ్‌లు అపహరణ**
**ఫొటోలు సోషల్ మీడియాలో పెడతామంటూ రూ.1.50 లక్షల డిమాండ్**
**ఐదుగురు అరెస్ట్.. ఆయుధాలు, దోపిడీ సొత్తు స్వాధీనం**

**ప్రజావాయిస్,కీసర:**
కారు కొనుగోలు చేస్తామని నమ్మించి బాధితులను ఫార్మ్‌హౌస్‌కు రప్పించి పిస్టల్, కత్తులతో బెదిరించి దోపిడీ చేసిన ఐదుగురు నిందితులను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుల నుంచి నగదు, ఐఫోన్, బంగారు గొలుసు, ఖరీదైన వాచ్‌లు, వీవతీఎవసవం-దీవఅఓ కారును అపహరించారు. అనంతరం వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో పెడతామంటూ రూ.1.50 లక్షలు డిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. బోగారం క్రాస్‌రోడ్స్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని ఎయిర్ పిస్టల్, కత్తి, ఐఫోన్, వాచ్‌లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.



# వినాయక నవరాత్రుల్లో డీజేలకు పోలీసుల హెచ్చరికలు

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్న సీఐ రంజిత్ రావు**
**- ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని సూచన**

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :
వినాయక నవరాత్రుల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు మండల పరిధిలోని డీజే నిర్వాహకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అవగాహన కల్పించారు.డీజే వినియోగానికి సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు, నిర్ణీత సమయాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా డీజేలు వినియోగించడం, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, నిర్ణీత సమయాలను అతిక్రమించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వినాయక నవరాత్రుల వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, ఎస్సై చంద్రకుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**123వ వార్డులో యూజీడీ పనులకు అనుమతి**
**పనుల పునఃప్రారంభం**

**అన్ని వర్గాలతో చర్చించి సమస్యను పరిష్కరించాం: ఏసీఎఫ్ అధ్యక్షుడు వినయ్‌రెడ్డి**

ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:
జీహెచ్ఎంసీ సర్కిల్ 123వ వార్డు పరిధిలోని ఫీల్‌గుడ్ హోమ్స్ కాలనీ వద్ద నెలలుగా కొనసాగుతున్న మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని ఏసీఎఫ్ అధ్యక్షుడు వినయ్‌రెడ్డి తెలిపారు. యూజీడీ అనుసంధానానికి సంబంధించి ఏర్పడిన వివాదం కారణంగా నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు సంబంధిత వర్గాల మధ్య అంగీకారం కుదిరిందన్నారు.వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. యూజీడీ పనులు నిలిచిపోవడంతో ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహించి స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ రహదారి సాయి బాలాజీనగర్, యాదయ్యనగర్, హిమగిరినగర్,కేకే నగర్-1, శ్రీనివాసనగర్,బైరాగిగూడ



తదితర ప్రాంతాలకు కీలక అనుసంధాన మార్గమని చెప్పారు.సమస్య పరిష్కారం కోసం 121,122, 123 డివిజన్ల ఏసీఎఫ్ ప్రతినిధులు,జీహెచ్ఎంసీ అధికారులు,ఫీల్‌గుడ్ హోమ్స్ అసోసియేషన్ ప్రతినిధులు,పోలీసులతో చర్చలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.అందరి సమక్షంలో సమస్యపై చర్చించి పరస్పర అంగీకారానికి వచ్చినట్లు పేర్కొన్నారు.దీంతో నిలిచిపోయిన యూజీడీ సీవరేజ్ లైన్ పనులను తిరిగి చేపట్టేందుకు అనుమతి లభించిందన్నారు.యూజీడీ పనులు పూర్తయితే రహదారిపై మురుగునీరు ప్రవహించే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వినయ్‌రెడ్డి తెలిపారు.పరిసర ప్రాంతాల ప్రజలు,వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు,కాలనీ సంఘాలు,సంబంధిత వర్గాలు సమన్వయంతో పనిచేయడం అవసరమని పేర్కొన్నారు.సమస్య పరిష్కారానికి సహకరించిన ఏసీఎఫ్ ఉపాధ్యక్షుడు నదీమ్,ప్రధాన కార్యదర్శి నరేందర్‌బాబు,ఈసీ సభ్యులు హరీష్‌గౌడ్, విజయ్ పద్మనాభం, జీహెచ్ఎంసీ డీఈఈ, సంబంధిత అధికారులు, ఫీల్‌గుడ్ హోమ్స్ అసోసియేషన్,పోలీసులకు వినయ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# మర్కటాల పోరు... రైతుల బేజారు





**ప్రజా వాయిస్/ ఆత్మకూరు (ఎం):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలో కోతుల బెడద రోజురోజుకి పెరిగిపోతుంది. ఇళ్లలోకి చొరబడి సా మాగ్రిని దక్కనివ్వడం లేదు. ఆహార పదార్థాలను తింటున్నాయి. తిండి గింజల కోసం సాగు చేస్తున్న పంట పొలాల్లోకి చొరబడి పాడు చేయడమే కాకుండా కొరికి వేస్తున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, మద్దతు ధర కోసం దిగులు చెందుతున్న రైతన్నలు ఇప్పుడు వానరాలను చూసి జంకుతున్నారు. మర్కటాల బెడదతో రైతులు పప్పు ధాన్యాల సాగుపై ఆసక్తి చూపకపోవడంతో వీటి సాగు ఏటా గణనీయంగా తగ్గిపోతుంది.వీటికి బదులు కోతులు తినని పంటలు సాగు చేసుకోవడమే మేలన్న ఆలోచనలో అన్నదాతలు ఉన్నారు.

**వల కట్టుకుంటేనే మేలు...**
మర్కటాలు వరి, పత్తి వంటి పంటలపై పడి పీకి వేయడం తో పాటు కొరికి చిందరవందర చేసి పంటను నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంటికి రెప్పలా కాపాడుకున్న పంట పొలాలను మర్కటాలు వదలకపోవడంతో అన్నదాతలు పంటలను కాపాడుకునేందుకు పొలాలు చుట్టు కంప, వలలు వేయవలసిన పరిస్థితి వచ్చిందని అంటున్నారు.గుంపులు గుంపులుగా వచ్చి పంటలపై పడి నష్టపరుస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితులను చూసి గత్యంతరం లేక కొన్ని పంటలు సాగు చేయడమే మానుకుంటున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి వాటిని పట్టుకొని అడవులలో వదిలేయాలని రైతులు కోరుతున్నారు.

# భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

**జహీరాబాద్ అసెంబ్లీకి ఇన్చార్జిగా ఎన్నికైన ప్రతాప్ రెడ్డి**

**పటాన్ చెరువు ప్రజా వాయిస్**
జహీరాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతాపార్టీ బలోపేతం కోసం నిరంతరం శాయశక్తుల కృషి చేస్తానని జహీరాబాద్ నియోజకవర్గానికి భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ఇన్చార్జిగా నూతనంగా ఎన్నికైన జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి అన్నారు భారతీయ జనతా పార్టీ సంస్థాగతంగా



తలోపేతం చేయడానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా ప్రతప్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో గత 25 సంవత్సరాల నుంచి మొక్కపోని విశ్వాసంతోని పార్టీ బలోపేతానికి పనిచేసే తనను పార్టీ గుర్తించి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు జిల్లాలోని ఐదు అసెంబ్లీలకు ఇన్చార్జిలను నియమించడం జరిగింది అందులో భాగంగా జహీరాబాద్ కు జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భారతీయ జనతా పార్టీలో గత 25 సంవత్సరాల నుండి నిర్విరామంగా పార్టీకి సమయం కేటాయిస్తూ పనిచేసిన అనుభవం ఉన్న నాయకున్ని నియమించడం జరిగింది కాబట్టి వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనమీద ఇంకా బాధ్యత పెంచినందుకు నాకు ఈ అవకాశాన్ని కలగజేసినందుకు జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డికి అలాగే ఎంపీ రఘునందన్ రావుకి ఎమ్మెల్సీ అంజిరెడ్డి భారతీయ జనతా పార్టీ పెద్దలకుకి ధన్యవాదాలు తెలిపారు పార్టీ అభివృద్ధి నిరంతరం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు

# మట్టి వినాయకుని పూజించండి, పర్యావరణన్ని రక్షించండి

**బొల్లారంలో పాత్రికేయుల చేతుల మీదుగా మట్టి వినాయక ప్రతిమల పంపిణి**

**జిన్నారం ప్రజావాయిస్**
మట్టి వినాయకున్ని పూజిచండి, పర్యావరణన్ని రక్షించండి అని బొల్లారం బీజేపీ అధ్యక్షులు కెజెఆర్ ఆనంద్ కృష్ణ రెడ్డి కోరారు. ఆదివారం బొల్లారం డివిజన్ పరిధిలోని బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు కెజెఆర్ ఆనంద్ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చెసిన మట్టి వినాయక ప్రతిమలను పాత్రికేయుల చేతుల మీదుగా పంపిణి చేయించారు. ఈ సందర్బంగా విలేకరులు జి. రామకృష్ణ,కృష్ణ కిషోర్, నరసింహ రెడ్డి మట్టి వినాయకుల ప్రతిమలను స్థానిక ప్రజలకు పంపిణి చేసారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆనంద్ కృష్ణ రెడ్డి పిలుపునిచ్చారు.భక్తి శ్రద్దలతో వినాయకున్ని పూజించి వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఈ సందర్బంగా ఆనంద్ కృష్ణ రెడ్డి బొల్లారం ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు టీ. రవీందర్ రెడ్డి, సమ్మయ్య,మోహన్,మోహిత్, బొల్లారం మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.





# పంటలకు జీవం... రైతులకు ఊరట

ప్రజా వాయిస్/ఆత్మకూరు(ఎం):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలో శని, ఆదివారాలలో అల్పపీడన ద్రోని ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా కురిసిన వర్షంతో మండల వ్యాప్తంగా వాడిపోతున్న పంటలకు కొంతమేర జీవం పోసినట్లయింది. గత కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో వేసిన పత్తి,ఆముదం,కంది తదితర పంటలు వాడిపోతుండడంతో వర్షం ఎప్పుడు పడుతుందోనని ఆకాశం వైపు తొంగి చూస్తున్న రైతులకు కురిసిన వర్షంతో కొంత ఊరట కలిగించింది. సాగునీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు ప్రస్తుత వర్షం కొంతమేర ఉపయోగపడుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షం వల్ల వాతావరణం చల్లబడి కొంత ఉపశమనాన్ని కలిగించిందని చెబుతున్నారు.



# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ప్రజా వాయిస్/ఆత్మకూరు(ఎం):
యాదగిరిగుట్ట పట్టణంలోని కార్యాలయంలో ప్రభుత్వ విప్,ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనారోగ్యముతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందడి అనంత రెడ్డి,పిఏసిఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి,మాజీ సర్పంచ్,మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జన్నాయికోడె నగేష్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు,మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు దొంతరబోయిన భాస్కర్,వర్కింగ్ ప్రెసిడెంట్ కోరే మల్లేష్, ఓ బి సి సెల్ పట్టణ అధ్యక్షులు గుండెగాని ఐలయ్య, ఎన్ ఎస్ యు ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ మండల నాయకులు లోడి మహేష్, ఎన్ ఎస్ యు ఐ పట్టణ అధ్యక్షులు పైళ్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తా


## జహీరాబాద్ అసెంబ్లీకి ఇన్చార్జిగా ఎన్నికైన ప్రతాప్ రెడ్డి



పటాన్ చెరువు ప్రజా వాయిస్ జహీరాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతాపార్టీ బలోపేతం కోసం నిరంతరం శాయశక్తుల కృషి చేస్తానని జహీరాబాద్ నియోజకవర్గానికి భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ఇన్చార్జిగా నూతనంగా ఎన్నికైన జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి అన్నారు భారతీయ జనతా పార్టీ సంస్థాగతంగా తలోపేతం చేయడానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా ప్రతప్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో గత 25 సంవత్సరాల నుంచి మొక్కవోని విశ్వాసంతోని పార్టీ బలోపేతానికి పనిచేసే తనను పార్టీ గుర్తించి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు జిల్లాలోని ఐదు అసెంబ్లీలకు ఇన్చార్జిలను నియమించడం జరిగింది అందులో భాగంగా జహీరాబాద్ కు జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భారతీయ జనతా పార్టీలో గత 25 సంవత్సరాల నుండి నిర్విరామంగా పార్టీకి సమయం కేటాయిస్తూ పనిచేసిన అనుభవం ఉన్న నాయకున్ని నియమించడం జరిగింది కాబట్టి వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనమీద ఇంకా బాధ్యత పెంచినందుకు నాకు ఈ అవకాశాన్ని కలగజేసినందుకు జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డికి అలాగే ఎంపీ రఘునందన్ రావుకి ఎమ్మెల్సీ అంజిరెడ్డి భారతీయ జనతా పార్టీ పెద్దలకుకి ధన్యవాదాలు తెలిపారు పార్టీ అభివృద్ధి నిరంతరం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు

# వైకుంఠపురంలో అవినీతి వరదా

- దేవుడి సొమ్ముతో “కోట్ల’ సామ్రాజ్యం
- భక్తుల విరాళాలకు శఠగోపం
- శ్రీమన్నారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ అర్చకుడు కందాడై వరదాచార్యులు మోసాలు
- సంగారెడ్డిలో చర్చనీయాంకమైన వైకుంఠపురం
- ఆలయ ప్రధాన పూజారీ వ్యవహారం





ప్రజా వాయిస్,సంగారెడ్డి :
జిల్లా కేంద్రంలో అధ్యాతి శోభకు, వేలాది మంది భక్తుల నమ్మకానికి నిలయమైన పవితపు క్షేత్రం వైకుంఠపురం. కలియుగ దైవమైన శ్రీ వేంకటే శ్వరస్వామివారి విరాట్ స్వరూపానికి ప్రతీరగా చూపుదిద్దుకున్న ఈ ఆలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామివారి దివ్య సంకల్పం, ఆశీస్సులతో 1996లో ఈ క్షేత్ర పునర్నిర్మాణానికి అడుగులు వడ్డాయి. స్వామివారీతో పాటు శ్రీ మహాలక్ష్మి గోదా దీని అమ్మవారు, సుదర్శన ఆశ్వాసన్నిధి ఇక్కడ కొలువు దీరాయి. శ్రీమన్నారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా గోసంరక్షణ, నిత్య అన్నదానాలు, ధూపదీప నైవేద్యాలు నిర్వహిస్తూ ఈ క్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగా విరజిల్లుతున్నది. ఇంతటి పవిత్రమైన పుణ్యక్షేత్రాన్ని, భక్తులు భక్తిపరవశంతో ఇచ్చిన కానుకలను ప్రధాన అర్చకుడిగా వ్యవహరిస్తున్న వరదాచార్యులు తన స్వార్థానికి, అక్రమార్జనకు వేది క మార్చుకున్నాడన్న ఆరోపణలు సంచలనం సృష్టి స్తున్నాయి. భక్తిని వ్యాపారంగా మార్చి, ఆధ్యాత్మికత ముసుగులో స్వామివారి నిధులను దారి మల్లించారన్న ప్రచారంతో ఈ కిలాడీ పూజారి వ్యవాహారం ఇప్పుడు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

**విరాళాలు దోచుకుని. ఆస్తుల కోసం దాచుకుని**

వైకుంఠపురం ఆలయ అభివద్ధి గోళాల నిర్వ హణ అన్నదానాల పేరిట కందాడ పరదాచార్యులు కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున విరాళాలు సేకరించారు. ఈ ఆలయంలో జరిగే పూజలతో పాటు కలియుగ వేంకటే శ్వరస్వామిని ఆరాధించే పలువురు ప్రజా ప్రతినిధులు, వ్యాపారస్థులు సైతం ఆలయ అభివృద్ధికి విరివిగా విరాళాలు అందజేశారు. దాతలు సమర్పించిన చెక్కులు, నగదును వరదాచార్యులు ఆలయ అధికారిక బ్యాంక్ ఖాతాల్లో ను చేయకుండా, పథకం ప్రకారం తన సొంత ఖాతాలతో పాటు బినామీల ఖాతాలకు మళ్లించినట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల ఒక వ్యాపారుడు ఆలయ అభివృద్ధికి రూ.16 లక్షల విరాళం అందజే యగా ఎలాంటి అభివృద్ధి పనులు మొదలు పెట్టకపోవడంతో సదరు భక్తుడు ట్రస్ట్ సభ్యులను నిలచేశాడు. దీంతో నిధుల గోల్ మాల్ వ్యవహారం బయటకు వచ్చి నట్లు సమాచారం.

**భారీగా భూములు, బంగారం మాయం**

ఆలయ ప్రధాన అర్చకుడిగా వ్యవహరి స్తున్న వరదాచార్యులు దేవుడి పేరిట వచ్చిన నిధులతో సంగారెడ్డి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎకరాలకొద్ది భూములు, ఓపెన్ ప్లాట్లు, భారీగా బంగారం కూడబెట్టినట్లు ఆరోపణలు చేస్తున్నాయి. స్వామివారికి రావాల్సిన రాబడితో తన సొంత జేబు నింపుకున్న వైనంపై స్థానికంగా భక్తులు తీవ్రఅగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**లెక్క తేల్చమంటే గాయబ్**

గత కొంతకాలంగా ఆలయ ఆదాయ వ్యయాల లెక్కింపులో దాతలు ఇచ్చిన విరాళాల రశీదుల్లో భారీ వ్యత్యాసాలు, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తుం డటంతో వైకుంఠపురం ఆలయ ట్రస్ట్ సభ్యులు, స్థానిక భక్తల ముందే ప్రతినిధులు రంగంలోకి దిగినట్లు తెలు స్తోంది. బ్యాంక్ స్టేట్ మెంట్లు, విరాళాల రికార్డులు, చెక్క పుస్తకాలను తమ ముందుంచాలని పూజారి వరదా చార్యులను గట్టిగా నిలదీసినట్లు సమాచారం. పూర్తి చెక్కులు చూపించాలని ఒత్తిడి పెంచడంతో నిధుల దారిమాళ్లింపు బయటపడిపోతుందనే భయంతో వరచాచార్యులు ఆలయం వీడిచి వెళ్లిపోయినట్లు తెలిసింది.

**మహిళల బలహీనతపై గురి...**

వైకుంఠపురానికి ముందు సదరు పూజారి ఫన లావీలో ఒక దేవాలయంలో అర్చకుడిగా పనిచేశారు. ఆ సమయంలో ఒక యువతిపై అసభ్యంగా ప్రవర్తించాడాన్న ఆరోపణలపై ఆ ఆలయం నుంచి తొలగించారన్న వాదనలు ఉన్నాయి. ఆ తర్వాత ఉదండి చిన్నజీయర్ స్వామి శిష్యుడిగా ప్రచారం చేసుకొని వైకుంఠపురంలో అడుగుపెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. వైకుంట పు రంలో సహచర అర్చకుడి సతీమణిని వేధింపులకు గురి చేశాడన్న తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. మొదట తన తప్పేమీ లేదని బుకాయించిన సదరు మహిళ సభ్యులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేయడంతో వరదాచార్యులు క్షమాపణలు చెప్పడం, బాధిత కుటుంబం అక్కడి నుంచి వెళ్లిపోవడం జరి గింది వరధాచార్యులు అర్చకుడిగా, తనకున్న ఆధ్యాత్మిక హోదాను అడ్డుపెట్టుకుని చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావు. కుటుంబ సమస్యల పరిహారం పేరిట ఆలయానికి వచ్చే అమాయక మహిళల బలహీనతలను ఆసరాగా చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో పలువురు ఉన్నత కుటుంబాలకు చెందిన మహిళలు సైతం బాధి తులుగా ఉన్నారని తెలుస్తుంది. ఇలాంటి ఘటనలపై అనేక ఫిర్యాదులు వచ్చినా.. వెనుక ఉన్న రాజకీయనా యకుల, పలుకుబడి కలిగిన పెద్దల అండదండలతో ట్రస్టు సభ్యులను మధ్య పెడుతూ ఆ వ్యవహారాలను తొక్కి పెట్టాలనే ప్రచారం సాగుతుంది.

# సంతోషంగా మొదలై – విషాదంగా ముగిసి

## పుట్టినరోజు వేడుక అనంతరం కారు ప్రమాదం

### 17 ఏళ్ల విద్యార్థి మృతి,మరో ఏడుగురికి గాయాలు

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నార్సింగి పోలీసులు



ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:
పుట్టినరోజు వేడుకతో సంతోషంగా మొదలైన రోజు, తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంతో విషాదంగా ముగిసింది. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధి,నియోపోలిస్‌లో కారు ప్రమాదానికి గురై 17 ఏళ్ల విద్యార్థి మదన్ మోహన్‌రెడ్డి మృతి చెందగా,మరో ఏడుగురు గాయపడ్డారు. కారులో మొత్తం ఎనిమిది మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.మదన్ మోహన్‌రెడ్డి శనివారం కూకట్‌పల్లిలోని తన స్నేహితుడి ఇంట్లో జరిగిన పుట్టినరోజు వేడుకకు హాజరయ్యాడు.అనంతరం టిఎస్ 06 ఎఫ్‌ఈ 4545 నంబర్ కారులో స్నేహితులతో కలిసి బయలుదేరారు.ఆదివారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటలకు నియోపోలిస్ జంక్షన్ నుంచి కోకాపేటలోని లేక్‌వ్యూ పాయింట్ వైపు వెళ్తుండగా నియోపోలిస్ వ్యూపాయింట్ సమీపంలో కారు ప్రమాదానికి గురైంది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మదన్ మోహన్‌రెడ్డి మృతి చెందినట్లు గుర్తించారు. కారులో ఉన్న మరో ఏడుగురికి గాయాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

**దర్యాప్తులో కీలక అంశాలు**

కారు నడిపింది మదన్ మోహన్‌రెడ్డేనని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతుడు మద్యం సేవించి వాహనం నడిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసినట్లు పోలీసులు తెలిపారు.అయితే ప్రమాదానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.సంఘటనా స్థల పరిశీలన,సీసీ కెమెరా దృశ్యాలు,సాక్షుల వాంగ్మూలాలు,ఇతర ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.ప్రమాదానికి అసలు కారణాలు దర్యాప్తు పూర్తయిన అనంతరం వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు.మద్యం సేవించి,అతివేగంగా వాహనాలు నడపకుండా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ ధరించాలని పోలీసులు సూచించారు.

# రికవరీ అధికారం ఎవరిది.?


### ఎంపీడీవో చర్యలపై గూడేప్పాడు గ్రామస్థుల ప్రశ్నలు

### స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న అధికారికే రికవరీ చేసే అధికారం ఉందా?

### పంచాయతీ కార్యదర్శి వివరణను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?

### సూపరింటెండెంట్‌గా చేరి.. ఎంపీడీవో పోస్టును ఖాళీగా చూపలేదన్న ఆరోపణలు





**ప్రజా వాయిస్, హన్మకొండ:**
లాస్ట్ పే సర్టిఫికెట్ (ఎల్‌పీసీ) ఆధారంగా నిధుల రికవరీకి ఆత్మకూరు ఎంపీడీవోకు అధికారం ఉందా? స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న ఎంపీడీవోకు ఇలాంటి చర్యలు చేపట్టే అధికార పరిధి ఎంతవరకు ఉంది? అనే ప్రశ్నలు ఆత్మకూరు మండలంలో చర్చనీయాంశంగా మారాయి. గూడేప్పాడు గ్రామపంచాయతీకి సంబంధించిన వ్యవహారంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై గ్రామస్థులు పలు ఆరోపణలు చేస్తున్నారు.పంచాయతీలో సర్పంచ్, పాలకవర్గం లేని నేపథ్యంలో ప్రభుత్వం మండలాధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. గ్రామాల్లో తాగునీటి మోటార్ల మరమ్మతులు, వీధిలైట్లు, పారిశుద్ధ్యం, బ్లీచింగ్ పౌడర్, రోడ్ల మరమ్మతులు తదితర పనులను పర్యవేక్షించి, నిబంధనల ప్రకారం పనులు పూర్తయిన అనంతరం కొలతలు నమోదు చేసి బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.అయితే గూడేప్పాడు గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్ తన సొంత డబ్బులతో కొన్ని పనులు చేయించినట్లు చెబుతున్నారు. ఆయా పనులకు సంబంధించిన బిల్లులను ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా సమర్పించినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోలేదని ఆయన వర్గం ఆరోపిస్తోంది. అదే సమయంలో గతంలో అవినీతి ఆరోపణలతో విధులకు దూరమైన కారోబార్‌ను తిరిగి విధుల్లోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**వివరణ ఇచ్చినా.. చర్యలేంటి.?**

పంచాయతీ కార్యదర్శి తనపై వచ్చిన అంశాలపై వివరణ సమర్పించినప్పటికీ దానిని పరిగణనలోకి తీసుకోకుండా చర్యలు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కింది స్థాయి ఉద్యోగిపై చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం, అవసరమైతే సరెండర్ చేయడం వంటి నిబంధనలను పాటించాల్సి ఉంటుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంలో ఎంపీడీవో అధికార ంపరిధి, తీసుకున్న చర్యలపై జిల్లా అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

**పోస్టింగ్‌పైనా ఆరోపణలు**

ఆత్మకూరు మండలంలో సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరిన శ్రీనివాస్‌రెడ్డి.. అనంతరం ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ ఇతరులకు అవకాశం లేకుండా అక్కడే కొనసాగారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల పదోన్నతుల సమయంలోనూ ఆత్మకూరు ఎంపీడీవో పోస్టుకు ఇతరులు రాకుండా చేసి, తిరిగి అదే స్థానంలో కొనసాగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ధ్రువీకరణ కావాల్సి ఉంది.

**కలెక్టర్ విచారణకు డిమాండ్**

ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి వ్యవహారశైలిపై సమగ్ర విచారణ జరిపించాలని గూడేప్పాడు గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్‌కు రావాల్సిన నాలుగు నెలల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎంపీడీవో విధుల్లో చేరినప్పటి నుంచి ఆయన నిర్వహించిన పరిపాలనా, ఆర్థిక వ్యవహారాలపై సంబంధిత ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు అంటున్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**గ్రామ గ్రామాన ఉత్సవాలు జరపాలి: ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్**




ముధోల్ నియోజకవర్గం/బైంసా: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం బైంసాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది తర్వాత నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న అన్ని జిల్లా కేంద్రాల్లో విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ విమోచన దినోత్సవం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సెప్టెంబర్ 17న బీజేపీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన జాతీయ జెండాలను ఎగురవేసి విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు.మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక వర్గం మెప్పు కోసం రాష్ట్రంలో అధికారికంగా నిర్వహించకపోవడం శోచనీయమని అన్నారు.సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి, సీనియర్ నాయకులు సాంవ్లీ రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, బైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు, దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతి ఒడిలో.. పండుగ సందడి.!

**జానకీనగర్‌లో ఘనంగా వనభోజనాలు**


**కుటుంబాలతో తరలివచ్చిన గ్రామస్తులు**

**ఆటపాటలతో చిన్నారులు, యువత సందడి**

**ప్రజా వాయిస్,చిలుకూరు:**
సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని జానకీనగర్ గ్రామంలో ఆదివారం వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ప్రకృతి ఒడిలో వంటలు చేసుకుని సామూహికంగా భోజనాలు చేశారు.చిన్నారులు, యువత ఆటపాటలతో ఉత్సాహంగా గడపగా.. మహిళలు, పెద్దలు పరస్పరం ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రోజువారీ పనులు, హడావుడికి దూరంగా గ్రామస్తులంతా ఒకచోట చేరి ఆనందంగా గడిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనుషా రవికుమార్, మండల ఎస్టీ సెల్ నాయకులు రాజేష్, ధర్మ, సురేష్, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు. గ్రామస్తులంతా కలిసికట్టుగా వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**తొర్రూర్ ఎస్సై మహేందర్ రెడ్డి**



**తొర్రూర్ ప్రజావాయిస్**
తొర్రూర్ మండలంలోని గ్రామాల ప్రజలు గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తొర్రూర్ ఎస్సై మహేందర్ రెడ్డి తెలిపారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో ఎలాంటి రాగద్వేషాలు లేకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, జరుపుకోవాలని సూచించారు. గణపతి మండపాల ముందు డీజే లాంటి సౌండ్స్, వినియోగించవద్దని ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు, కార్యక్రమాలు ముగించుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించి, సమయపాలన పాటించకుండా ప్రజలకు ఇబ్బంది కలిగించే శబ్దాలు చేస్తున్నట్టు పోలీసు దృష్టికి వస్తే, కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకునే, నిర్వాహకులు, మండపాల వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎస్సై కోరారు.



# బీమని అనిల్ ను పరామర్శించిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజా వాయిస్/రాయపర్తి
వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో.ముదిరాజ్ సొసైటీ అధ్యక్షులు బీమని అనిల్ తండ్రి బీమని నరేందర్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ తరపున 50 కేజీ ల బియ్యం, ఆయిల్ క్యాన్, ను సహాయం చేసిన...ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ కందికట్ల స్వామి ఉప సర్పంచ్ చిప్ప శ్రీనివాస్, పార్టీ ముఖ్య నాయకులు సంకినేని ఎల్లస్వామి, తాటికాయల భాస్కర్, బీమని యాదగిరి, బీమని రమేష్, గాదె హరీష్, తాటికాయల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పోతారం వద్ద గోదావరి వంతెన పనుల్లో స్టీలు రాడ్ల చోరీ

**- రూ.30 వేల విలువైన 5 క్వింటాళ్ల రాడ్ల మాయం**

**- స్థానిక వ్యక్తిపై అనుమానం.. పోలీసులకు ఫిర్యాదు**



**ప్రజా వాయిస్ మంథని**
మండల పరిధిలోని పోతారం గ్రామం వద్ద గోదావరి నదిపై చేపడుతున్న వంతెన నిర్మాణ పనుల వద్ద ఉంచిన ఐదు క్వింటాళ్ల స్టీలు రాడ్లు ఆదివారం చోరీకి గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని కాంట్రాక్ట్ సిబ్బంది తెలిపారు.
?సైట్ సెక్యూరిటీ సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో మెటీరియల్ కనపడటం లేదని నిర్వాహకుడు బుర్రా శ్రీనివాస్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో ఆయన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, వంతెన పనుల కోసం తెచ్చిన స్టీలు రాడ్లు చోరీకి గురైనట్లు గుర్తించారు.
?కాగా, ఈ చోరీ ఘటనలో స్థానికుడైన అనిల్ అనే వ్యక్తి హస్తం ఉన్నట్లు తమకు తెలిసిందని శ్రీనివాస్ తెలిపారు. బాధ్యులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుని, చోరీకి గురైన స్టీలు రాడ్లను త్వరగా రికవరీ చేయాలని కోరుతూ మంథని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



## ప్రయాణికుల ప్రాంగణం...

# బైకులకు నిలయం

**ప్రజా వాయిస్/ ఆత్మకూరు (ఎం):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రయాణికుల ప్రాంగణం నేడు బైకులకు నిలయంగా మారింది. వివరాల్లోకి వెళితే ఆత్మకూరు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం మండల పరిధిలోని ప్రజలు వస్తుంటారు. మండల కేంద్రం నుండి ప్రయాణికులు పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సుల కోసం రోడ్డుపై పిల్లాపాపలతోపాటు లగేజీతో ఎండకు, వానకు నిలబడవలసి వస్తుందనే ఉద్దేశ్యంతో ప్రయాణ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రయాణ ప్రాంగణం రోడ్డు ఎత్తు పెరగడంతో ప్రయాణ ప్రాంగణం ఎత్తు తగ్గింది. దీంతో ప్రయాణికులు కూర్చుంటే పైకప్పు తగులుతుందని ఉద్దేశంతో కూర్చోవడం లేదు. పైగా వచ్చి పోయేటి వాహనాలు కనిపించడం లేదు. నేడు ఈ ప్రయాణ ప్రాంగణం... బైకులకు నిలయంగా మారింది. ప్రయాణికులు ఎండ, వానలో నిలబడలేక సమీపంలోని హోటళ్లను, షాపులను ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రయాణికుల ఇబ్బందులను గమనించి నూతన ప్రయాణ ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని మండల పరిధిలోని ప్రయాణికులు కోరుతున్నారు.



# సనాతన ధర్మానికి 'సహస్ర వేదిక్'...

**11 ఏళ్లుగా వీడని 'మట్టి' బంధం**

**ప్రకృతిని ప్రేమిద్దాం..మట్టి గణపతిని పూజిద్దాం..**

**సహస్ర వేదిక సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ**

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం
మట్టితో మొదలైన పండగ, తిరిగి ఆ మట్టిలోనే కలిసిపోవాలనే సనాతన ధర్మాన్ని నిలబెడుతూ.. పర్యావరణ పరిరక్షణను తమ బాధ్యతగా స్వీకరించింది సహస్రా వేదిక సేవా సమితి ఫౌండర్స్ కల్లెట్ల అరుణ్ సాగర్, ఉప్పుగుల గిరిబాబు, కోగూరి శ్రవణ్ ,సభ్యులు కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గత 11 సంవత్సరాలుగా ఈ సంస్థ అందిస్తున్న సేవలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి.వినాయక చవితి పండగ వచ్చిందంటే చాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయన రంగులతో తయారుచేసిన విగ్రహాల వల్ల చెరువులు, కాలువలు ఎంతగా కలుషితమవుతున్నాయో మనందరికీ తెలిసిందే. ఈ ప్రమాదాన్ని ముందుగానే గ్రహించిన సహస్రా వేదిక సేవా సమితి సభ్యులు, తమ గ్రామాన్ని పర్యావరణహిత గ్రామంగా మార్చాలని సంకల్పించారు. అందులో భాగంగానే గత పదకొండు ఏళ్లుగా వినాయక చవితి పండగను పురస్కరించుకుని గ్రామస్తులందరికీ ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నారు.ప్రతీ ఏటా పండగకు కొద్ది రోజుల ముందే మట్టి విగ్రహాలను సిద్ధం చేసి, స్థానిక భక్తులకు, గ్రామస్తులకు ప్రేమతో అందిస్తున్నారు. రసాయన విగ్రహాలకు దూరంగా ఉండి, పర్యావరణానికి మేలు చేసే మట్టి గణనాథుడిని పూజించడం వల్ల కలిగే ప్రయోజనాలను ఊరూరా వివరిస్తూ ఒక మంచి మార్పుకు శ్రీకారం చుట్టారు.కేవలం విగ్రహాల పంపిణీకే పరిమితం కాకుండా, ప్రకృతిని కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమేనని చాటిచెబుతున్న సహస్రా వేదిక సేవా సమితి కృషిని నారాయణపురం మండల ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు ఎంతో అభినందిస్తున్నారు. 11 ఏళ్ల ఈ సుదీర్ఘ ప్రయాణం మరెంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



# కోరుట్ల పాలిటెక్నిక్‌లో కంప్యూటర్ సైన్స్ మంజూరు చేయండి

**మంత్రి వివేక్‌కు సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు విజ్ఞప్తి**

**ప్రజా వాయిస్, కోరుట్ల:**
కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం (2025--26) నుంచి 'కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాదులో రాష్ట్ర శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి వినతిపత్రం సమర్పించారు. స్థానిక విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత సాంకేతిక యుగానికి అనుగుణంగా కోరుట్ల పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ కోర్సును అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందో మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి.. పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని సానుకూలంగా హామీ ఇచ్చారని జువ్వాడి కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

**షాబాద్‌లో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ**



**(ప్రజా వాయిస్ షాబాద్ )**
షాబాద్ పట్టణంలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు.ఈ సందర్భంగా హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, మట్టి విగ్రహాలతో పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించవచ్చని తెలిపారు.ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే తమ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మట్టి వినాయకుడి ప్రతిమలను ఉపయోగించాలని వారు కోరారు కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు మల్లికార్జున్,కొండ ప్రదీప్, శ్రీనివాస్, అశోక్, బస్వరాజ్, రాఘవేందర్, సత్యేందర్ తదితరులు పాల్గొన్నారు.




# కీసర ఓఅర్ ఆర్ పైన ఘోర రోడ్డు ప్రమాదం

### కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి

ప్రజావాయిస్, కీసర:
షామీర్‌పేట్ నుంచి పెద్ద అంబర్‌పేట్ వైపు వెళ్తున్న కారు కీసర ఎగ్జిట్–8 సమీపంలో లారీ ఢీకొట్టడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో తోపాటు,ఒకరు మృతి. ఈ ఘటన ఆదివారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాదంలో కారు డ్రైవర్ అలేటి శిరీష్ కుమార్ (38) అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సీసీటీవీ కెమెరాల డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నరని, వనస్థలిపురంలోని A111, |˜CÙ--1 కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.ప్రమాదానికి గురైన కారు మహీంద్రా శఖుఎ 700 (TS07JY3123) కాగా, లారీ TG07W1296గా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పట్టణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

### - కౌన్సిలర్ సరస్వతి



ప్రజా వాయిస్,సంగారెడ్డి :
వినాయక చవితి పర్వదిన సందర్భంగా జోగిపేట – అందోల్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ సరస్వతి పట్టణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ఏడాది పాటు పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, తలపించుకున్న పనులన్నీ విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. వినాయక మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, మండపాలకు ఎలాంటి నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దంటూ తెలిపారు. ఎందుకంటే వర్షాకాలం అయినందున మండపాల వద్ద ఏర్పాటుచేసిన ఇనుపరాడులకు విద్యుత్ షాక్ వచ్చే ప్రమాదం ఉందని వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు.

# తెలంగాణ మీసేవ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా చిక్కుడు మహేష్

### మీసేవ కేంద్రాల నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా




**ప్రజా వాయిస్ దుబ్బాక/ దౌల్తాబాద్, సెప్టెంబర్ 13:**
తెలంగాణ మీసేవ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శిగా చిక్కుడు మహేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఫెడరేషన్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలు అందుతున్నందున నిర్వాహకులకు అవసరమైన సహకారం, సౌకర్యాలు అందేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తానన్నారు. మీసేవ కేంద్రాల నిర్వాహకుల హక్కులు, సంక్షేమం కోసం ఫెడరేషన్ తరఫున నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లాలోని మీసేవ కేంద్రాల నిర్వాహకులను సమన్వయం చేసుకుంటూ ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్వాహకులకు అందుబాటులో ఉంటానని తెలిపారు. చిక్కుడు మహేష్ జిల్లా కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా పలువురు మీసేవ కేంద్రాల నిర్వాహకులు, ఫెడరేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# చైనాలో హుస్నాబాద్ బిడ్డకు అరుదైన గౌరవం

### డాక్టర్ దేవేందర్‌కు 'ఉత్తమ విదేశీ బోధకుడి' అవార్డు

ప్రజా వాయిస్ హుస్నాబాద్
చైనాలో జరుగుతున్న విద్యా, పరిశోధనా రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన హుస్నాబాద్ పట్టణానికి చెందిన డాక్టర్ పొన్నం దేవేందర్‌కు 'ఉత్తమ విదేశీ బోధకుడి' అవార్డు వరించడం పట్ల 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన పొన్నం మల్లయ్య, భాగ్యమ్మల కుమారుడైన దేవేందర్, చిన్ననాటి నుంచి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగడం తమ ప్రాంతానికే గర్వకారణమని కొనియాడారు. చైనాలోని యున్నాన్ మిన్జు యూనివర్సిటీ (కున్మింగ్)లో 2024 నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న దేవేందర్‌ను, 2025--26 విద్యా సంవత్సరానికి గాను ఆ విశ్వవిద్యాలయం 'ఎక్సలెంట్ అండ్ అవుట్‌స్టాండింగ్ ఫారిన్ టీచర్' అవార్డుతో సత్కరించిందని తెలిపారు. ఈ




పురస్కారం కింద ఆయనకు 8 వేల చైనీస్ యువాన్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 1.2 లక్షలు) నగదు బహుమతి లభించిందన్నారు.రసాయన శాస్త్ర పరిశోధనల్లో కీలక పాత్ర పోషించడంతోపాటు భారత్--చైనా దేశాల మధ్య విద్యా, పరిశోధనా సంబంధాలను బలోపేతం చేసినందుకు గాను ఆయనకు ఈ అంతర్జాతీయ గౌరవం దక్కిందని కౌన్సిలర్ పేర్కొన్నారు. దేవేందర్ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేసి, ఫోటోకెమిస్ట్రీ, ఆర్గనోకెటాలిసిస్ విభాగాల్లో విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రొఫెసర్ ఫాన్ బాఒమిన్ పరిశోధన బృందంలో సభ్యుడిగా ఉన్న దేవేందర్, గతంలో 2016--18 మధ్య చైనాలోని వుహాన్‌లో పోస్ట్‌డాక్టోరల్ పరిశోధనలు చేశారని




గుర్తుచేశారు. ఆ తర్వాత 2019--23 కాలంలో భారతదేశంలోని ప్రముఖ అరాగెన్ లైఫ్ సైన్సెస్, హానర్ ల్యాబ్స్ సంస్థల్లో టీమ్ లీడర్‌గా విజయవంతంగా సేవలు అందించారని పేర్కొన్నారు. దేవేందర్ సాధించిన ఈ గొప్ప విజయం హుస్నాబాద్ ప్రాంతానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి సైతం ఎంతో పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిందని వరప్రసాద్ గౌడ్ కొనియాడారు.

# వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసు అనుమతి తప్పనిసరి

**పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలి**

**డీజేలు, అధిక శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదు**

**ఆన్‌లైన్‌లో వివరాల నమోదు కోసం**
:https://policeportal.tspolice.gov.in

**వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**

ప్రజా వాయిస్.. వనపర్తి
వనపర్తి, సెప్టెంబర్ 13: ఈ నెల 14వ తేదీ సోమవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వనపర్తి జిల్లా పరిధిలో గణేష్ మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుశాఖకు సమాచారం అందించి అనుమతి పొంది భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసుశాఖ సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్., తెలిపారు. ఈ https://policeportal.tspolice.gov.in ఆన్లైన్ లింక్ ను క్లిక్ చేసి అందులో దరఖాస్తు దారుని వివరాలు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, అది ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న మండపం ఎత్తు,



కమిటీ సభ్యులు పేర్లు వారి ఫోన్ నెంబర్లు, విగ్రహం ప్రతిష్ఠించే రోజు, నిమజ్జనం చేసే తేదీ సమయం, ప్రదేశం, ఆ ప్రదేశానికి ఏ వాహనంలో చేరుకుంటారు, అదేవిధంగా మండప నిర్వహకులు, గణపతి కమిటీ సభ్యులు, వాలంటీర్ల వివరాలు, ఫోన్ నెంబర్లు చిరునామా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. వనపర్తి జిల్లాలోని పట్టణాలలో మరియు గ్రామాలలో నిర్వహించే గణపతి మండప నిర్వహకులు ఈ వెబ్సైట్ నందు వివరాలను పొందుపరచాలని సూచించారు. ఆన్లైన్ ద్వారా వివరాలు కాని సందర్భంలో దగ్గర్లో ఉన్న పోలీస్టేషన్ ను సంప్రదించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయక ప్రతిష్టాపనకు ప్రాధాన్యత కేటాయించాలని తెలిపారు. గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలి. షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించాలి. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు,మండపాల బాధ్యత వహించే వారి వివరాలు,ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలి. గణేష్ ప్రతిమలు ఏర్పాటు చేసే ప్రదేశంలో షెడ్ నిర్మాణంలో మంచి నాణ్యత గల షెడ్ ఏర్పాటు చేసుకోవాలి. గణేష్ మండపంలో 24 గంటలు ఇద్దరు వాలంటీర్ ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి. గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శనను దృష్టిలో వుంచుకోని మండపాలలో భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటీర్లను నియమించాలి. మండపాల దగ్గర విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి,పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు. ఎట్టి పరిస్థితులలోనూ పెద్ద శబ్దాలతో కూడిన లౌడ్ స్పీకర్స్, డి.జె. లకు అనుమతి లేదని అన్నారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా పోలీసు యంత్రాంగం 24 గంటలు అందుబాటులో అప్రమత్తంగా ఉంటుందని వెంటనే డయల్ 100 లేదా 112 కు సంప్రదించాలని ఎస్పీ తెలిపారు.

# గడకగడక బువ్వ కథనం చూసినా స్పందించని అధికారులు

### గురుకులంలో సమస్యలపై పరిశీలనకు వెళ్లిన బిజెపి నాయకులు

**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి**
ఎల్కతుర్తి లో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారంటూ ఇటీవల గడకగడక బువ్వ అని పత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో బిజెపి మహిళ మోర్చా అధ్యక్షురాలు నాంపల్లి మమత బిజెపి మండల అధ్యక్షుడు మన్నుర్తి శ్రీకాంత్ యాదవ్ గురుకుల పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకొని ఆహారం నాణ్యత అల్పాహారం సమయపాలన పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించేందుకు వెళ్లిన బిజెపి నాయకులకు గురుకుల ప్రిన్సిపాల్ నుంచి సరైన స్పందన లభించలేదని వారు ఆరోపించారు. హెడ్ ఆఫీస్ పర్మిషన్ కావాలంటూ లోపలికి అనుమతించకుండా తప్పించుకున్నారని తెలిపారు.

**పేపర్ కథనం చూసిన పట్టించుకోని వైనం..?**
గురుకులంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరమని బిజెపి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం భవిష్యత్తుతో ముడిపడిన సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి.**
ఎల్కతుర్తి బాలికల గురుకులంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత వంట సిబ్బంది పనితీరు పరిశుభ్రత టెండర్ల కేటాయింపు తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు గురుకుల



సొసైటీ ఉన్నత అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే బిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# తెలంగాణ ధనిక రాష్ట్రం.. అది రోశయ్య చలవే

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిందంటే, ఆ ఘనత పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రోశయ్య ముందుచూపు వల్లే 2014 జూన్ 2న తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడిందని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెన్నారెడ్డి, విజయభాస్కర రెడ్డి, వై.ఎస్. రాజశేఖర రెడ్డి వంటి ముఖ్యమంత్రులు రాష్ట్ర ఖజానా బాధ్యతలను ఆర్యవైశ్యులకే అప్పగించారని తెలిపారు. రోశయ్య అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసి, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను శాసనమండలిలో దూకుడుగా మాట్లాడినప్పుడు, రోశయ్య తనను పక్కకు పిలిచి కోపాన్ని తగ్గించుకుని అనుభవంతో ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటావని సలహా ఇచ్చారని వెల్లడించారు. రోశయ్య ఎప్పుడూ కఠినంగా విమర్శించలేదని, తన చతురత, వాగ్ధాటితోనే పదునైన వ్యాఖ్యలు చేసేవారని అన్నారు. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటును కొందరు విమర్శించారని, కానీ నాలుగు దశాబ్దాల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి, కష్టసుఖాల్లో ఇక్కడే ఉంటానని చెప్పిన ఆయన మాటకు గౌరవమిచ్చి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. ఆర్యవైశ్యులు సౌమ్యులని, ఆత్మగౌరవం, ముందుచూపు, విజ్ఞత వారి డీఎన్ఏలోనే ఉన్నాయని సీఎం ప్రశంసించారు. ఎంతోమంది పేదరికంలో ఉన్నా, ఆత్మగౌరవానికి విలువిచ్చి తమను పేదవారిగా చెప్పుకోవడానికి ఇష్టపడరని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి మహనీయులు ఆర్యవైశ్య వర్గానికి చెందినవారేనని గుర్తుచేశారు. ఆర్యవైశ్యులకు దక్కాల్సినంత గుర్తింపు రాలేదని పేర్కొన్న సీఎం, ఈ ఆత్మగౌరవ భవనం పేద ఆర్యవైశ్యుల అవసరాలు తీర్చాలని ఆకాంక్షించారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



# మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

### ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి...

### జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి...

**శామీర్ పేట్ / ప్రజా వాయిస్ :**
వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కీసర సర్కిల్, శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ శ్రీ సీతారామ స్వామి దేవస్థానం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్లు దాసరి గోపాల్ రెడ్డి, పేండం లక్ష్మినారాయణ, బీజేపీ నాయకులు పట్నం నర్సింహారెడ్డి, దుర్గం ప్రకాశ్ గౌడ్, దేవరయాంజాల్ సూపర్‌వైజర్లు ఆనంద్, రజిని తదితరులు పాల్గొని భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

**నీటి వనరుల పరిరక్షణకు మట్టి విగ్రహాలే మేలు**
మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవచ్చని పలువురు పేర్కొన్నారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల మట్టి వినాయకుల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచించారు.

**భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి అందిద్దాం**
పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని నాయకులు



అన్నారు. ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పించేలా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ చేపట్టడం అభినందనీయమన్నారు. "మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.. నీటి వనరులను పరిరక్షిద్దాం.. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందిద్దాం" అని పిలుపునిచ్చారు.



# మానింసింగ్ తండాలో ఘనంగా తీజ్ వేడుకలు

### బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా తీజ్ ఉత్సవం

ప్రజావాయిస్ బోధన్ నియోజకవర్గం, నవీపేట్ మండలం, ఫాక్రాబాద్:ఫాక్రాబాద్ పరిధిలోని మానింసింగ్ తండాలో తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. తీజ్ పండుగలో భాగంగా ప్రత్యేకంగా పెంచిన తీజ్ మొక్కలను అలంకరించి తలపై మోసుకుంటూ మహిళలు, యువతులు సంప్రదాయ పద్ధతిలో ఊరేగింపుగా తరలివచ్చారు. పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీజ్ మొక్కలను పూజించి కుటుంబ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. తీజ్ వేడుకలు బంజారా మహిళల ఐక్యతకు, వారి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడానికి ప్రతీకగా నిలుస్తాయని పలువురు తెలిపారు. పెద్దలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మానింసింగ్ తండాలో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రజావాయిస్ ప్రతినిధి.. లక్ష్మణ్

# నిజామాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిగా రాగిని భాస్కర్‌కు పదోన్నతి: కోరుట్లలో ఘన సన్మానం



ప్రజా వాయిస్, కోరుట్ల:
నిజామాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిగా పదోన్నతి పొందిన కోరుట్లకు చెందిన రాగిని భాస్కర్‌ను ఆదివారం మున్నూరు కాపు జేఏసీ కార్యాలయంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, మున్నూరు కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండారి శంకర్ తదితరులు పాల్గొని భాస్కర్‌ను శాలువాతో సత్కరించారు. గిరిజనుల సంక్షేమం కోసం ఆయన మరిన్ని సమర్థవంతమైన సేవలు అందించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.



# పట్టణ సమస్యలపై ఇక సమష్టి స్వరం

### ఆర్‌డబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడిగా సీతారాం ధూళిపాల

### ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడు సీతారాం ధూళిపాల అన్నారు.రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు ఎదురయ్యే సమస్యలకు ఫెడరేషన్ అండగా ఉంటుందని చెప్పారు. జీహెచ్ఎంసీ త్రివిభజన అనంతరం ప్రతిపాదించిన 'కోర్ అర్బన్--2026'లోని అంశాలను సమీక్షించి, ప్రజలకు ఇబ్బందులు కలిగించే లోటుపాట్లను సరిదిద్దే వరకు చట్టపరిధిలో కృషి చేస్తామని పేర్కొన్నారు.పట్టణ ప్రజలకు సంబంధించిన కీలక సమస్యలపై కార్యవర్గ సభ్యులతో సమాలోచనలు జరిపి కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు.సీతారాం ధూళిపాల రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించి, అనంతరం బొమ్ము ఉపేందర్,అందె లక్ష్మణ్‌రావు,ఆరిఫ్ మహమ్మద్,సుమనలిని, బొడ్డు శ్రీధర్,జైరామ్, మంజుల,దేవిప్రియ, మాసాని చంద్రబాబులు ఆయనను శాలువా, గజమాలతో సత్కరించారు.





# జనరిక్ మందులతో సామాన్యులకు భారీ ఊరట

### బోధన్ కొత్త బస్టాండ్ వద్ద జనరిక్ ఆధార్ మందుల దుకాణం ప్రారంభం

ప్రజావాయిస్ బోధన్:
ఖరీదైన వైద్య మందులతో ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు జనరిక్ మందులు ఊరటనిస్తున్నాయని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ రోడ్డులో ఐసీఐసీఐ బ్యాంక్ ఎదురుగా ఏర్పాటు చేసిన జనరిక్ ఆధార్ మందుల దుకాణాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జనరిక్ మందులు నాణ్యతలో ఏమాత్రం తగ్గకుండా తక్కువ ధరకే లభిస్తాయని తెలిపారు. ఖరీదైన బ్రాండెడ్ మందులకు ప్రత్యామ్నాయంగా జనరిక్ మందులను వినియోగించడం ద్వారా ప్రజలు తమ వైద్య ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. అవసరమైన మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడం సామాన్యులకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటనారాయణ, దుకాణ నిర్వాహకులు శివ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు..

బోధన్ ప్రజావాయిస్ ప్రతినిధి - లక్ష్మణ్

# పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరు మట్టి గణపతులని పూజించండి

### ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

### జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో 551 ఉచిత మట్టి గణపతులు పంపిణీ




ప్రజా వాయిస్ బెల్లంపల్లి టౌన్
జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో దాతలు మరియు సభ్యుల సహకారంతో పర్యావరణ పరిరక్షణ కొరకు బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా వద్ద పర్యావరణ పరిరక్షణ కొరకు భక్తులకు ఉచితంగా 551 మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బెల్లంపల్లి శాసన సభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొని ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రజలు అందరు మట్టి గణపతులు పూజించాలి అని కోరారు. ప్రతి సంవత్సరం జనహిత సేవా సమితి వారు మట్టి గణపతులు పంపిణీ చేయడం అభినందనీయం అని జనహిత సేవా సమితి సేవలని అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు మాట్లాడుతూ జనహిత సేవా సమితి సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలు,రక్తదాన కార్యక్రమాలు,చలివేంద్రం నిర్వాహణ,నేత్ర అవయవ దాన కార్యక్రమాలు, మట్టి గణపతులు పంపిణీ ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత సేవా సమితి ఆవిర్భావం నుండి 10 సంవత్సరాలు గా పర్యావరణ పరిరక్షణ కొరకు దాతల సహకారం తో మట్టి గణపతులు పంపిణీ చేస్తున్నామని దాతల సహకారంతో ఈ రోజు 551 మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేయడం జరిగిందని పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రజలు రసాయనాలతో కూడిన (పిఓపి) విగ్రహాలు కాకుండా మట్టి గణపతులు పూజించి పర్యావరణ పరిరక్షణ కొరకు సహకరించాలని కోరారు. మట్టి గణపతులు పంపిణీ కార్యక్రమం కొరకు సహకారం అందించిన దాతలకి సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకురి రాంచెందర్, కౌన్సిలర్ పున్నం చంద్రు, మాజీ కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, శంకర్ సింగ్,నీలి కృష్ణ నాయకులు దావ రమేష్ బాబు, బండారి ప్రవీణ్, పలువురు నాయకులు జనహిత సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**శామీర్ పేట / ప్రజా వాయిస్ :**
అలియాబాద్ మున్సిపాలిటీకి చెందిన వేల్పుల భూషణం ఇటీవల మృతి చెందారు. ఆదివారం అలియాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తోట లక్ష్మణ్ ఆధ్వర్యంలో షామీర్పేట మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ సమక్షంలో వేల్పుల భూషణం కుటుంబ సభ్యులకు రూ. 5000 వేలు ఆర్థిక సహయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్నూరు కాపులు ఏలాంటి ఆపదలో ఉన్న వారికి అండగా ఉండి మున్నూరు కాపు సంఘం సభ్యులు ముందుకు వచ్చి ఆదుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబీకులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు వైల ఎల్లయ్య, వైల నర్సింగరావు, కరుణాకర్, శ్రీనివాస్, రాజేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# పాలకుర్తి నూతన సీఐ భరత్ సుమన్‌ను కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు

ప్రజా వాయిస్ /పాలకుర్తి /సెప్టెంబర్ 13
పాలకుర్తి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భరత్ సుమన్ ను పాలకుర్తి బీఆర్ఎస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఐ భరత్ సుమన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పాలకుర్తి సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు తమవంతు సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్, పాలకుర్తి బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు పసునూరి నవీన్, పాలకుర్తి ఉపసర్పంచ్ గాదపాక కిరణ్, ఇతర గ్రామాల సర్పంచులు వార్డ్ మెంబర్లు మరియు కార్యకర్తలు, ఇన్చార్జిలో, యూత్ నాయకులు పలువురు బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.